J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 40 సంచిక : 36 5.2.2021, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి



## పంతాలకు పోయి.. పరువు తీసుకుంటున్నారు

## వ్యక్తిగత ఆధిపత్యం కోసం..



# వ్యవస్థలతో ఆడుకుంటున్నారు

- నిమ్మగడ్డను జైలుకు పంపుతామంటున్న ప్రభుత్వం
- అతిచేస్తే ఎన్నికలు రద్దు చేస్తానంటున్న రమేష్‌కుమార్

రాష్ట్ర ప్రభుత్వం- రాష్ట్ర ఎన్నికల కమిషన్... రెండు వ్యవస్థల మధ్య ఆధిపత్యపోరు రోజు రోజుకు పంతాలు-పట్టింపులతో కొత్త పుంతలు తొక్కుతూ ప్రజలకి అత్యంత ఆసక్తిని రగిలిస్తోంది. కోర్టులు ఇచ్చిన దన్నుతో ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్ ఒక రకంగా మహాబలుడుగా మారి అడుగడుగునా ప్రభుత్వాన్ని అభిశంసిస్తూ వస్తున్నాడు. అడ్డు చెప్పిన అధికారులపై ఎలాంటి చర్యలకైనా వెనకాడడం లేదు. సీనియర్ ఐఏఎస్ అధికారులు గోపాలకృష్ణ ద్వివేదీ, గిరిజా శంకర్‌లను బలవంతంగా పదవీ విరమణ చేయాలనడం దగ్గర నుంచి ముఖ్యమంత్రి కార్యాలయ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్‌ని ఆ స్థానం నుంచి పక్కన పెట్టండి వరకు... జిల్లాల పర్యటన నుంచి ఎన్నికలలో పోటీచేస్తూ అనుమానాస్పద మృతి చెందిన కుటుంబాల పరామర్శ నుంచి... రేషన్ డోర్‌డెలివరీ వాహనాలపై ముఖ్యమంత్రి ఫోటో తొలగించాలనడం వరకు... ఒకరకంగా చెప్పాలంటే ముఖ్యమంత్రిని తాత్కాలికంగా.. అంటే, ఎన్నికలయ్యే వరకు పక్కన పెట్టండి అనడం మినహా మిగతా అన్ని చర్యలూ తీసుకుంటున్నారు నిమ్మగడ్డ.

అదే సమయంలో ప్రభుత్వం కూడా ఎక్కడా తగ్గడం లేదు. గోపాలకృష్ణ ద్వివేదీ, గిరిజాశంకర్‌లపై నేరుగా చర్యలు తీసుకునే అధికారం ఎస్‌ఈసీకి లేదని, ప్రవీణ్‌ప్రకాష్ అసలు ఎన్నికల కమిషన్ పరిధిలోకి రారని ఎక్కడికక్కడ నిమ్మగడ్డ ఆధిపత్యాన్ని అడ్డుకునే ప్రయత్నం చేస్తూనే ఉంది. మరొకవైపు మంత్రుల గౌరవానికి భంగం వాటిల్లేలా గవర్నర్‌కి లేఖ రాశారని, ఇది శాసనసభ్యుల హక్కుల భంగం కింద నేరం అని, దీనిపై స్పీకర్ నిమ్మగడ్డని జైలుకు పంపించవచ్చన్న వదంతులు కూడా ప్రస్తుతం విస్తృతంగా నడుస్తున్నాయి. 2008లో మహారాష్ట్రలో ఇలానే స్పీకర్ ఆ రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌ని రెండు రోజుల పాటు జైలుకి సైతం పంపారని ఉదాహరణలతో తాజాగా సోషల్ మీడియా హోరెత్తిస్తోంది. ఇంకా 54రోజుల పాటు పదవిలో ఉండనున్న నిమ్మగడ్డ ఎన్ని సంచలనాలకు దారి తీస్తాడు, ప్రభుత్వం ఎంత బలంగా వీటిని అడ్డుకోనుంది అన్న చర్చ ప్రస్తుతం రాష్ట్రంలో హాట్ టాపిక్‌గా మారింది.

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి – రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్‌ల మధ్య వ్యక్తిగత ఆధిపత్యం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘం మధ్య వివాదంగా మారి రోజురోజుకు తీవ్రమౌతూనే ఉంది. గవర్నర్‌కి రాసిన లేఖలోని అంశాలపై ఏపీ అసెంబ్లీ స్పీకర్ కూడా స్పందించారు. ప్రివిలేజ్ కమిటీకి లేఖను పంపించారు. దానిపై అత్యవసరంగా ప్రివిలేజ్ కమిటీ సమావేశం అయ్యింది. ఈ నేపథ్యంలో గతంలో మహారాష్ట్రలో జరిగిన ఇలాంటి ఉదంతం ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో హాట్ టాపిక్ అయ్యింది.

## మహారాష్ట్ర ఎస్‌ఈసీకి జైలు శిక్ష ఎందుకు పడింది?


మహారాష్ట్రలో 2008 లో ఆ రాష్ట్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర ప్రభుత్వం మధ్య జరిగిన వివాదం ఇది. ప్రివిలేజ్ కమిటీకి చేరింది. 2006లో ఆ రాష్ట్ర స్థానిక ఎన్నికల నిర్వహణ విషయంలో నాటి ఎస్‌ఈసీ నందలాల్ అనే ఐఏఎస్ అధికారి సభా హక్కుల ఉల్లంఘనకు పాల్పడినట్టు ఫిర్యాదులు వచ్చాయి.

నాటి ఎమ్మెల్యే జనార్ధన్ చందూర్కర్ ఇచ్చిన ఫిర్యాదుతో ప్రివిలేజ్ కమిటీ ఎస్‌ఈసీకి నోటీసులు జారీ చేసింది. అయితే ప్రివిలేజ్ కమిటీ ముందు హాజరుకాకుండా, డెప్యూటీ సెక్రటరీ స్థాయి అధికారితో వివరణ పంపించిన ఎస్‌ఈసీ తీరుపై కమిటీ సీరియస్ అయ్యింది. వారం రోజుల పాటు కారాగార శిక్ష విధిస్తూ నిర్ణయం తీసుకుంది. ఆ తర్వాత దానిని రెండు రోజులకు కుదించారు.

10లో




ఈ నెల 4న నెల్లూరుజిల్లా పర్యటనకు వచ్చి, జిల్లా కలెక్టర్ తదితర అధికారులతో సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఎస్ఇసి నిమ్మగడ్డ రమేష్‌కుమార్



# పంచాయతి ఎన్నికలకు ఏర్పాట్లు సిద్ధం

## పంచాయతిరాజ్ ప్రధాన కార్యదర్శికి వివరించిన కలెక్టర్



జిల్లాలో పంచాయతి ఎన్నికలను పటిష్టంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని పంచాయతిరాజ్‌శాఖ ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేదికి జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు చెప్పారు. ఈనెల 1న పంచాయతిరాజ్ కమిషనర్ గిరిజాశంకర్, ఎన్నికల కార్యదర్శి కన్నబాబుతో కలిసి గోపాలకృష్ణ ద్వివేది నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ చక్రధర్‌బాబు ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయం నుంచి హాజరై ఎన్నికల ఏర్పాట్ల విషయం వివరించారు. జిల్లాలో నాలుగు విడతలుగా జరగనున్న పంచాయతి ఎన్నికలకు పోలింగ్, లెక్కింపు సామగ్రితో పాటు, తొలివిడతకు అవసరమైన బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేశామని వారికి వివరించారు. అభ్యర్థుల నామినేషన్ పరిశీలన అనంతరం తుది జాబితా ప్రకటించగానే బ్యాలెట్ పత్రాల ముద్రణకు చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో ఎన్నికల నియమావళి ఖచ్చితంగా అమలుజరిగేలా మండల అధికారులకు స్పష్టమైన ఆదేశాలిచ్చామని, కోవిడ్ మార్గదర్శకాలను అనుసరించి పోలింగ్ జరిగేలా అవసరమైన ఏర్పాట్లన్నీ చేస్తున్నామని చెప్పారు. జిల్లాలో 24,640 మంది పోలింగ్ సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలను కూడా షెడ్యూలు వారీగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్‌తో పాటు జేసీ హరేందిరప్రసాద్, జడ్పీ సిఇఓ సుశీల, పంచాయతి అధికారి ధనలక్ష్మి పాల్గొన్నారు.

# రాపూరు తహశీల్దార్, డెప్యూటీల సస్పెన్షన్

అవినీతి ఆరోపణలతో జిల్లాలోని ఒక తహశీల్దార్, డెప్యూటి తహశీల్దార్లు సస్పెండ్‌కు గురయ్యారు. పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వడంలో అవినీతికి పాల్పడుతున్నారని, కంప్యూటర్లలో పేర్లు మార్చడం వంటి అక్రమాల వెనుక వీరి హస్తం ఉందని వచ్చిన ఫిర్యాదులతో జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు వారిద్దరినీ సస్పెండ్ చేస్తూ ఈ నెల 3న ఉత్తర్వులిచ్చారు. రాపూరు తహశీల్దార్ మధుసూదన్‌రావు, డెప్యూటి తహశీల్దార్ జమీర్‌బాషాలపై వచ్చిన ఆ ఫిర్యాదులను విచారించేందుకు నెల్లూరు ఆర్డీఓ హుస్సేన్ సాహెబ్‌ను కలెక్టర్ విచారణాధికారిగా నియమించారు. ఆయన విచారణలో భారీ స్థాయిలో అక్రమాలు వెలుగులోకి రావడంతో ఆర్డీఓ నివేదిక మేరకు జిల్లా కలెక్టర్ వారిద్దరినీ సస్పెండ్ చేశారు.

# విద్యుత్ అధికారులకు రివార్డులు

జిల్లాలో మెరుగైన విద్యుత్ వ్యవస్థ కోసం కృషిచేసిన పలువురు విద్యుత్ అధికారులకు ఈనెల 3న విజయవాడలో జరిగిన కార్యక్రమంలో ఏపి ట్రాన్స్‌కో సిఎండి నాగులపల్లి శ్రీకాంత్ రివార్డులను అందజేశారు. జిల్లాలో ట్రాన్స్‌ఫార్మర్ల విభాగంలో పనిచేస్తున్న డి.ఇ జగదీష్ 6221 ట్రాన్స్‌ఫార్మర్లను రిపేరు చేసినందుకు రివార్డును అందుకున్నారు. అదేవిధంగా ఎంఅండ్‌పి విభాగానికి చెందిన డిఇ అనిల్‌కుమార్, విజిలెన్స్ సిఐ జగన్మోహన్‌రావు, వెంకటగిరి ఏడిఇ మునిరవిచంద్ర, నాయుడుపేట ఏఇ వరప్రసాద్, ముత్తుకూరు ఏఇ హనుమారెడ్డి, కావలి రూరల్ ఏఇ కుమార్, వెంకటగిరి ఏఇ జమీర్ అహ్మద్, కావలి ఏఇ శీనయ్య ఈ రివార్డులను అందుకున్నవారిలో ఉన్నారు.

# మరో ఏడుగురికి కరోనా

జిల్లాలో ఈనెల 3న 1340 మందికి కోవిడ్ పరీక్షలు నిర్వహించగా ఏడుగురికి కరోనా పాజిటివ్ వచ్చింది. వీరిలో ఒకరిని నెల్లూరు పెద్దాసుపత్రికి తరలించి, మిగిలినవారిని హోం ఐసోలేషన్‌లో ఉంచి చికిత్సలు అందిస్తున్నారు. ఇప్పటికే చికిత్సలు పొందుతున్న బాధితుల్లో అయిదుగురు కరోనా నుంచి కోలుకోవడంతో వారిని డిశ్చార్జి చేశారు. దీంతో జిల్లాలో ఇప్పటిదాకా మొత్తం 63,908 మంది కరోనా బారిన పడగా, 63,245 మంది కోలుకుని ఇళ్ళకు వెళ్ళారు. మిగిలిన 75 మంది వివిధ ఆసుపత్రుల్లో చికిత్సలు పొందుతున్నారు. ఇప్పటివరకు జిల్లాలో ఈ వ్యాధి బారినపడి 588 మంది మరణించారు. కరోనా కేసులు క్రమంగా తగ్గుతున్నాయనుకుంటున్న సమయంలో మళ్ళీ స్వల్పంగా బాధితుల సంఖ్య పెరుగుతుండడం ప్రజలకు ఆందోళన కలిగిస్తోంది.

# పింఛన్లు ఒకటో తేదినే ఇవ్వాలి

విశ్రాంత ఉద్యోగులకు పింఛన్లను ఒకటోతేదినే ఇవ్వాలని, ఈ నెల ఇప్పటిదాకా పింఛన్ ఇవ్వకపోవడంతో ఎంతో ఇబ్బందులకు గురవుతున్నారని, ఇంటి అద్దె, మందులు తదితర ఖర్చులకు ఇబ్బందులు పడకుండా విశ్రాంత ఉద్యోగులకు వెంటనే పింఛన్ ఇవ్వాలని ఏపి ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ ఈనెల 3న ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు.

# ఇది కార్పొరేట్ల బడ్జెట్

**- సిపిఐ నిరసన**

కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ దారుణంగా ఉందని, దేశ సంపదను కార్పొరేటర్లకు ధారాదత్తం చేసేలా బడ్జెట్ ఉందని సిపిఐ నాయకులు దుయ్యబట్టారు. ఈనెల 3న నెల్లూరులోని ములుముడి బస్టాండ్ వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి మునీర్ మాట్లాడుతూ కేంద్రబడ్జెట్‌లో రాష్ట్రానికి మొండిచెయ్యి చూపారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎరువులు, ఆహారరంగాలకు సబ్సిడీ తగ్గించడం వల్ల ప్రజాపంపిణీ వ్యవస్థ నిర్వీర్యం అవుతుందని, బీమా రంగంలో విదేశీ పెట్టుబడులు పెంచడం మంచిది కాదని అన్నారు. ఈ నిరసనలో ఏఐటియుసి జిల్లా శాఖ అధ్యక్షుడు అన్వర్, రైతు సంఘం నాయకుడు షానవాజ్, సిపిఐ నాయకులు అజీజ్, రషీద్, లతీఫ్, సుబహాన్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సవరణ బిల్లులకు వ్యతిరేకంగా ఆందోళన

కేంద్రప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన విద్యుత్ సవరణ బిల్లులకు వ్యతిరేకంగా నెల్లూరులోని విద్యుత్‌భవన్ వద్ద ఉద్యోగులు ఆందోళన చేశారు. జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళనలో జేఏసి నాయకులు దుగ్గిరాల సూరిబాబు, ఎస్‌కె అల్తాఫ్ మట్లాడుతూ ఈ సవరణ బిల్లుల వల్ల విద్యుత్ ఉద్యోగులకు నష్టం జరుగుతుందని, వినియోగదారులపై భారం పెరుగుతుందని అన్నారు. వాటిని వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. విద్యుత్‌శాఖ ఎస్ఇ ఆదిశేషయ్య, నగర డిఇ శ్రీహరిరావు, ఎస్‌పిడిసిఎల్ ప్రధాన కార్యదర్శి సుమన్, కె.శ్రీనివాసులు, సుధాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# హెడ్‌మాస్టర్ సస్పెన్షన్

నెల్లూరులోని మూలాపేట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ ప్రసూనను సస్పెండ్ చేస్తూ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆదేశాలిచ్చారు. ఈనెల 1న ఆయన ఆ పాఠశాలను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనంలో కోడిగుడ్డు ఇవ్వకపోవడాన్ని గుర్తించారు. ప్రభుత్వ విద్యా కానుక కిట్లు కూడా బాలికలకు ఇవ్వలేదని తెలుసుకుని హెచ్‌ఎంపై మండిపడ్డారు. హెచ్‌ఎంను సస్పెండ్‌చేస్తూ, పాఠశాల పనితీరు పర్యవేక్షణ లోపంపై నెల్లూరు ఎంఇఓ రహీమ్‌కు షోకాజ్ నోటీసు జారీచేశారు.

# వాలీబాల్ క్రీడాకారుల ఎంపిక

నెల్లూరు, ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో ఈనెల2న వాలీబాల్ సబ్ జూనియర్స్, అండర్-16 అంతర్‌జిల్లాల ప్రాబబుల్స్ జిల్లా క్రీడాకారులను ఎంపిక చేశారు. బాలుర విభాగంలో కె.గోవర్ధన్, వి.అభిలాష్, ఎం.హర్షవర్ధన్, వి.సుభాష్ (స్టాండ్‌బై)లను, బాలికల విభాగంలో షేక్‌మాలిన్, జి.అనుష్క, సిహెచ్ సంజన, బి.ఆశ, సిహెచ్ సుజాత(స్టాండ్‌బై)లను ఎంపిక చేసినట్టు జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అడ్‌హాక్ కమిటీ కన్వీనర్ కె.వెంకటరామిరెడ్డి తెలిపారు. వీరంతా ఈనెల 6 నుంచి భీమవరంలో జరిగే పోటీలకు ప్రాతినిధ్యం వహించనున్నట్లు చెప్పారు.

# ఆంధ్రాలో 'సుబ్బిశెట్టి'కి ఇక సెలవు

## 'చింతామణి' నాటకాన్ని నిషేధించిన ప్రభుత్వం

'చింతామణి' నాటకం తమ మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉందని, ఆ నాటకాన్ని ప్రదర్శించకుండా నిషేధించాలని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ముఖ్యమంత్రికి విజ్ఞాపన చేసింది. ఆర్యవైశ్య మహాసభ విజ్ఞప్తికి స్పందించిన జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కడా 'చింతామణి' నాటకాన్ని ప్రదర్శించరాదని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. 'చింతామణి' నాటకంలో ప్రధానపాత్ర సుబ్బిశెట్టిది. చింతామణి తల్లి శ్రీహరి, చెల్లి చిత్రలతో సుబ్బిశెట్టి చేసే హాస్య సరస సంభాషణ ఈ నాటకంలో ప్రధానమైనది. అయితే, సుబ్బిశెట్టి పాత్ర తమ మనోభావాలు దెబ్బతీసే విధంగా ఉందని ఆర్యవైశ్య మహాసభ భావించడంతో, వారి విజ్ఞప్తి మేరకు ఈ నిషేధాన్ని విధించడంతో మన రాష్ట్రంలో సుబ్బిశెట్టికి ఇక సెలవే!...

# బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండిచెయ్యి

**సోమిరెడ్డి**

రాజధానిని కోల్పోయిన రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇవ్వకపోగా, బడ్జెట్ కేటాయింపుల్లోనూ కేంద్రం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మొండిచెయ్యి చూపిందని, నిధుల కేటాయింపులో మన రాష్ట్రాన్ని మరచిపోయారని మాజీమంత్రి, టిడిపి నాయకుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. పెట్రోల్ ధరలు పెంచడం, వ్యవసాయానికి సంబంధించి ఎరువుల సబ్సిడీని తగ్గించేయడం దురదృష్టకరమని ఆయన కేంద్ర బడ్జెట్ పట్ల అసంతృప్తిని వ్యక్తం చేశారు.

# టిడిపి నేతల అరెస్టులు దారుణం

**- కోటంరెడ్డి శీనయ్య**

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడును అరెస్ట్ చేయడం అనైతికమని, టిడిపి నాయకులపై అక్రమకేసులు పెడుతుండడం, దాడులు చేస్తుండడం వంటి చర్యలు దారుణమని టిడిపి నెల్లూరు నగర ఇన్‌ఛార్జి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి అన్నారు. ఈనెల 3న నగరంలోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పంచాయతి ఎన్నికల్లో వైకాపా వారి ఆటలు సాగడం లేదని, బరిలో బలమైన టిడిపి వారు ఉండడంతో సహించలేక ఈ దాడులకు వైకాపా వారు పాల్పడుతున్నారని విమర్శించారు. టిడిపి నాయకుడు పట్టాభిపై వైకాపా వారే దాడిచేశారని ఆయన ఆరోపించారు. సిఎం జగన్ పాలన ఎమర్జన్సీని తలపిస్తోందని, ఎన్నికల్లో ప్రజలు ఓటుతో వైకాపాకు గుణపాఠం చెప్పాలని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు జెన్ని రమణయ్య, ధర్మవరపు సుబ్బారావు, మామిడాల మధు, పిట్టి సత్యనాగేశ్వరరావు, కప్పిర శ్రీనివాసులు, జహీర్, పడవల కృష్ణమూర్తి, అబ్దుల్ మస్తాన్, పెంచలయ్య, మున్నా, బాబుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# సామాన్యులను పట్టించుకోని బడ్జెట్

## కాంగ్రెస్ నాయకుల ఆందోళన



కేంద్రప్రభుత్వం తాజాగా ప్రవేశపెట్టిన కేంద్రబడ్జెట్ నిరాశాజనకంగా ఉందని, సామాన్య ప్రజలకు, మధ్యతరగతి వారికి ఈ బడ్జెట్ వల్ల ఎలాంటి ఉపయోగం లేదని, పేదల ఆశలను బడ్జెట్ నీరుగార్చిందని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి విమర్శించారు. బడ్జెట్‌లో కేవలం కరోనా అంశమే తప్ప పేదలు, సామాన్య ప్రజల గురించి పట్టించుకోలేదని, పైగా పెట్రోల్, డీజల్ ధరలపై సెస్సులు విధించడం వల్ల వాటి ధరలు పెరిగి సామాన్యులపై మరింత భారం పడుతుందని పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్ తెలుగు ప్రజలను ఈసారి కూడా తీవ్ర నిరాశకు గురిచేసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 3న జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నెల్లూరులోని ఇందిరాభవన్ ఎదుట కేంద్రబడ్జెట్‌కు వ్యతిరేకంగా ఆందోళన చేశారు. బిజెపి పాలనలో ఆంధ్రప్రదేశ్ ఆర్థికంగా సంక్షోభంలో కూరుకుపోయిందని, కేవలం నియంతృత్వ ధోరణితో బిజెపి ప్రభుత్వం వ్యవహరిస్తోందంటూ కాంగ్రెస్ నాయ కులు ఆరోపించారు. బడ్జెట్‌ను నిరసిస్తూ అటు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, ఇటు ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు ఎలాంటి వ్యాఖ్యలు చేయకపోవడం విచారకరమన్నారు. దేశంలో ఎన్నికలు జరిగే రాష్ట్రాలను మాత్రమే దృష్టిలో పెట్టుకుని పక్షపాతంతో ఈ బడ్జెట్‌ను విడుదల చేశారంటూ విమర్శించారు. ఈ ఆందోళనలో కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు కొండా అనిల్‌కుమార్, జిల్లా యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడు పప్పర్తి గణేష్ బాబు, మైనార్టీ విభాగం అధ్యక్షుడు షేక్ అల్లావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఆ గంధర్వగానం అమోఘం... అజరామరం!

# ఆ మధురగాయకుని 'స్మారకం'... నిలవాలి ఆచంద్రతారార్కం!..



భారతీయ సినిమా గాయకుడు, తెలుగుజాతి గర్వించదగిన జ్ఞా(గా)న గంధర్వుడు 'పద్మవిభూషణ్' శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం (యస్‌పి బాలు)ని భవిష్యత్ తరాలు గుర్తుంచుకునేలా, ఈ సృష్టి ఉన్నంతవరకు ఆయన గానం, ఆయన గాత్రం నిరంతరం వినిపించేలా ఒక స్మారక కేంద్రాన్ని నిర్మించాలని ఆయన మిత్రులు, ఆప్తులు నిర్ణయించారు.

## ఎస్పీ బాలు మిత్రులు, ఆత్మీయుల సంకల్పం



కూర్చున్నవారు (ఎడమ నుండి కుడికి) : గోల్కొండ హోటల్స్ & రిసార్ట్స్ చైర్మెన్ రామిరెడ్డి, శాంతా బయోటెక్నిక్స్ వ్యవస్థాపకులు వరప్రసాద్‌రెడ్డి, మెగాస్టార్ చిరంజీవి, సీనియర్ జర్నలిస్ట్ రామచంద్రమూర్తి, గ్లోబల్ హాస్పిటల్స్ చైర్మెన్ డా. రవీంద్రనాథ్.
నిల్చున్నవారు : కిమ్స్ హాస్పిటల్స్ చైర్మెన్ భాస్కర్‌రావు, రాజ్యసభ సభ్యులు అయోధ్యరామిరెడ్డి, స్టార్ హాస్పిటల్స్ చైర్మెన్ డా. గోపిచంద్, 'లాయర్' వారపత్రిక సంపాదకులు శివప్రభాత్‌రెడ్డి(ప్రభు), ఫినిక్స్ సంస్థల చైర్మెన్ సురేష్, సన్‌షైన్ హాస్పిటల్స్ చైర్మెన్ డా. గురవారెడ్డి, మ్యాక్ సంస్థల చైర్మెన్ మురళీకృష్ణారెడ్డి

ఫిబ్రవరి 1వతేది సోమవారం నాడు, సీనియర్ జర్నలిస్టు రామచంద్ర మూర్తి చొరవతో మెగాస్టార్ చిరంజీవి కోరిక మేరకు హైదరాబాదులో శాంతాబయోటెక్నిక్స్ ఛైర్మెన్ కె.ఐ.వరప్రసాద్‌రెడ్డి ఇంట్లో జరిగిన ఆత్మీయసమావేశంలో ఈ మేరకు తీర్మానంచేశారు. చిరంజీవి, వరప్రసాద్ రెడ్డిలతో పాటు సీనియర్ పాత్రికేయులు రామచంద్రమూర్తి, సన్‌షైన్ హాస్పిటల్స్ ఛైర్మెన్ డాక్టర్ గురువారెడ్డి, స్టార్ హాస్పిటల్స్ ఛైర్మెన్ డాక్టర్ గోపీచంద్, మాక్ ప్రాజెక్ట్స్ అధినేత మురళీకృష్ణారెడ్డి, గ్లోబల్ హాస్పిటల్స్ సారధి డాక్టర్ రవీంద్రనాథ్, 'లాయర్' వారపత్రిక సంపాదకుడు శివప్రభాత్ రెడ్డి(ప్రభు), ఫీనిక్స్ అధినేత చుక్కపల్లి సురేష్, రాజ్యసభ సభ్యులు, రాంకీ సంస్థల వ్యవస్థాపకులు అయోధ్య రామిరెడ్డి, గోల్కొండ హోటల్స్ & రిసార్ట్స్ ఛైర్మెన్ రామిరెడ్డి ఈ ఆత్మీయ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### ఎంతోమంది హీరోలకు బాలు తన గాత్రంతో జీవితాన్నిచ్చారు - చిరంజీవి

మహామేధావి, యావత్ భారతీయ సినిమారంగం ఆరాధించే గొప్ప గాయకులు, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం తన గాత్రంతో ఎంతోమంది హీరోలకు జీవితాన్ని ఇచ్చాడని, వారిలో తానూ ఒకడినని చిరంజీవి అన్నారు. ఈ రోజు బాలు మనమధ్య లేకపోవడం చాలా బాధాకరమని, ఆయన స్మృత్యంకంగా ఒక మంచి కార్యక్రమాన్ని చేయాలని తాను భావిస్తున్న తరుణంలో రామచంద్రమూర్తి తన ఆలోచనలకు ఊపిరి పోసేలా స్ఫూర్తిని కలిగించాడని చెప్పారు. బాలుగారికి ఏదైనా మంచి స్మారక చిహ్నాన్ని ఏర్పాటు చేయాలన్న ఆలోచన వచ్చిన వెంటనే, తన మదిలో మెదిలిన మొట్టమొదటి వ్యక్తి వరప్రసాద్‌రెడ్డి అని అంటూ... బాలుగారి ఆత్మీయులు, సంగీతప్రియులు ముందుకు వచ్చి ఈ మహాత్కార్య క్రమానికి పూనుకుంటే తనవంతు చేయూత అందించడానికి తానూ సిద్ధంగా ఉన్నానని చెప్పారు.

### ఈ సృష్టి ఉన్నంత కాలం ఆయనా, ఆయన పాటా-మాటా జీవించే ఉండాలి

**- వరప్రసాద్‌రెడ్డి**

బహుభాషా చిత్రాలలో 42వేలకుపైగా పాటలు పాడి, 54 సంవత్సరాలపాటు భారతీయ చలనచిత్ర రంగంలో తన గానమందించిన ఘనాపాటి బాలు అని, ఆయన సేవలకు గుర్తుగా చిరస్మరణీయమైన స్మారక మందిరాన్ని నిర్మిస్తే బాగుంటుందని వరప్రసాద్‌రెడ్డి సూచించారు. తెలుగు రాష్ట్రాలలో ముఖ్య పట్టణాలలో కీలక మార్గాలకు ఆయన పేరు పెట్టడంతో పాటు కొన్ని కూడళ్ళకు 'బాలు సర్కిల్స్'గా నామకరణం చేస్తే బాగుంటుందని వరప్రసాద్‌రెడ్డి ప్రతిపాదించారు. బాలు లాంటి గాయకుడు ఇప్పుడు మనమధ్య లేకపోయినా.. ఈ సృష్టి ఉన్నంత కాలం ఆయనా, ఆయన పాటా, మాటా జీవించే ఉండేలా బాలసుబ్రహ్మణ్యం స్మారకం ఉండాలని వరప్రసాద్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. తన ఆప్తమిత్రుడికి నివాళిగా, తనవంతు బాధ్యతగా 32 నిమిషాల నిడివితో బాలు జీవిత విశేషాలతో కూడిన లఘుచిత్రాన్ని (డాక్యుమెంటరీ) రూపొందిస్తున్నా మన్నారు. అలాగే బాలు జీవిత ప్రస్థానాన్ని కాఫీ టేబుల్ పుస్తకం రూపంలో ఆవిష్కరించబోతున్నట్లు ప్రకటించారు. జూన్ 4, 2021న బాలు జన్మదినం నాటికి ఈ రెండు కార్యక్రమాలు పూర్తిచేయనున్నట్లు చెప్పారు.

### బాలు కీర్తి.. భావితరాలకు స్ఫూర్తి కావాలి

**- రామచంద్రమూర్తి**

భవిష్యత్ తరాలలో స్ఫూర్తిని నింపే విధంగా రెండు తెలుగురాష్ట్రాలలో బాలసుబ్రహ్మణ్యం స్మారక మందిరాలను నిర్మించడమే ఆయనకు నిజమైన నివాళి అని సీనియర్ జర్నలిస్టు రామచంద్రమూర్తి తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

### అంతర్జాతీయ స్థాయిలో ఫౌండేషన్ ఏర్పాటు చేయాలి

**-డాక్టర్ గురువారెడ్డి**

డాక్టర్ గురువారెడ్డి మాట్లాడుతూ....బాలు పేరిట ముందుగా ఫౌండేషన్ ఏర్పాటు చేసుకుని జాతీయ, అంతర్జాతీయంగా ఉన్న ఆయన అభిమానులను ఆ ఫౌండేషన్‌లో సభ్యులుగా చేసి ఒక ప్రణాళిక ప్రకారం బాలు స్మారక కార్యక్రమాలు నిరంతరం కొనసాగేలా చేయాలని ప్రతిపాదించారు. డాక్టర్ గోపీచంద్, మురళీకృష్ణారెడ్డి, డాక్టర్ రవీంద్ర నాథ్‌లు గురువారెడ్డి ప్రతిపాదనను బలపరచారు.

### నెల్లూరులో ఆడిటోరియం నిర్మించాలి

**- శివప్రభాత్‌రెడ్డి**

నెల్లూరులో... ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన ఆడిటోరియంకి బాలు పేరు పెట్టి అదే ప్రాంగణంలో ఆయన విగ్రహం కూడా నెలకొల్పేలా రాజ్యసభసభ్యులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, అయోధ్యరామిరెడ్డిలు చొరవ చూపాలని శివప్రభాత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

### గ్రామీ అవార్డుల తరహాలో బాలు పేరిట అంతర్జాతీయ అవార్డు ఏర్పాటు చేయాలి

**-చుక్కపల్లి సురేష్**

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన 'గ్రామీ అవార్డు'ల తరహాలో బాలు పేరు మీద అంతర్జాతీయ అవార్డు ఏర్పాటుచేయాలని చుక్కపల్లి సురేష్ సూచించారు. బాలు పేరుమీద ఏ కార్యక్రమం చేపట్టినా అది బాలు స్థాయికి తగ్గట్లుగా ఉండాలని... తెలంగాణ, ఆంధ్ర ముఖ్యమంత్రుల సహకారంతో అత్యద్భుతమైన స్మారకాన్ని ఏర్పాటు చేసుకునేలా సంగీత అభిమానులందరం కృషిచెయ్యాలని సురేష్ అన్నారు. హైదరాబాదు నగరంలోని హైటెక్ సిటీ ప్రాంతంలో ఉన్న శిల్పకళా వేదికను ఫౌండేషన్ ఆధ్వర్యంలో నడపడానికి ప్రభుత్వం అనుమతి తీసుకుని ఆ ప్రాంగణానికి బాలు పేరు పెడితే ఎలా ఉంటుందో కూడా ఆలోచించమని కోరారు.

### బాలు ఒక ప్రాంతానికో, రాష్ట్రానికో చెందినవాడు కాదు - అయోధ్య రామిరెడ్డి

బాలు ఒక ప్రాంతానికో, ఒక రాష్ట్రానికో చెందినవాడు కాదని అయోధ్య రామిరెడ్డి అన్నారు. యావత్ భారతావనిని తన పాటలతో అలరించిన ఆ అమర గాయకుడికి, ప్రధానమంత్రి, ముఖ్యమంత్రుల స్థాయిలోని వ్యక్తులను భాగస్వామ్యులను చేసి సంగీత ప్రపంచం గర్వించేలా స్మారక కార్యక్రమాలను నిర్వహిస్తే బాగుంటుందని ఆయన తన మనసులోని మాటను వ్యక్తపరచారు.

### చేసే పని ప్రతిష్టాత్మకంగా ఉండాలి

**- గోల్కొండ రామిరెడ్డి**

ఆశయం, ఆలోచన ఆమోదయోగ్యంగా ఉన్నాయని... బాలు స్మారకంగా ఏ కార్యక్రమం చేపట్టినా, అది అత్యంత ప్రతిష్టాత్మకంగా ఉండి, భవిష్యత్ తరాలు కూడా ఇదే స్ఫూర్తితో ఆ కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగించేలా కమిటీ చర్యలు తీసుకోవాలని గోల్కొండ రామిరెడ్డి సూచించారు.

అందరి సూచనలు, అభిప్రాయాలు తీసుకున్న అనంతరం, ముందుగా కీలక వ్యక్తులతో ఒక ప్రతినిధుల బృందం ఏర్పడి తెలంగాణ, ఆంధ్ర ముఖ్యమంత్రులను కలసి బాలు స్మారకాలకోసం ప్రభుత్వాల సహకారం అందించమని కోరాలని తీర్మానించారు.

రామచంద్రమూర్తి ఆలోచనను, తాను వ్యక్తపరచిన వెంటనే దానిని ఆశయంగా మార్చుకుని ఎస్‌పి బాలసుబ్రహ్మణ్యం గారి స్మారక కార్య క్రమానికి వరప్రసాద్‌రెడ్డి గారు పూనుకోవడం సంతోషదాయకం అని చిరంజీవి అన్నారు. వరప్రసాద్‌రెడ్డి పిలుపుతో ముందుకు వచ్చి ఈ మహత్కార్యక్రమానికి కంకణబద్ధులు కావడానికి ఆసక్తి చూపుతున్న వారందరికీ చిరంజీవి ధన్యవాదాలు తెలిపారు. త్వరలోనే మరోసారి కలుసుకుని కార్యాచరణ రూపొందించుకోవాలని తీర్మానించారు.

### ప్రభుత్వాలు స్పందించాలి

బాలు ఆత్మీయులంతా ఒక చోట చేరి మంచి ఆలోచనే చేశారు. రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా ఈ విషయంలో సానుకూలంగా స్పందించాలి. ఎస్‌పి బాలసుబ్రహ్మణ్యం వంటి ప్రతిభా శాలిని ఇప్పటికే 3 తరాలు చూశాయి, ఆయన గాత్రాన్ని విన్నాయి. ఆయనంతటి గొప్ప మేధావి, ఆయనలా 54సంవత్సరాలపాటు సుమారు 14భాషల్లో 42వేలకు పైగా పాటలు పాడిన గాయకుడిని భవిష్యత్ తరాలు చూడాలంటే బహుశా మరో 50ఏళ్ళు పడుతుందేమో? అంతటి గొప్ప జ్ఞానగంధర్వుడు శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం. ప్రాంతాలకు అతీతంగా ఆయన పాడని భాషలేదు, కులమతాలకు చోటివ్వకుండా ఆయన కీర్తించని దేవుడు లేడు. పెద్దలు సంకల్పించినట్లుగా ఆయన పేరిట నెల్లూరుతో పాటు రెండు తెలుగు రాష్ట్రాలలో బాలు సంస్మరణ మందిరాలను స్థాపించగలిగితే... సంగీత, సాహిత్య సరస్వతి నిలయాలుగా అవి భాసిల్లుతాయి. భావి తరాలకు బాసటగా నిలుస్తాయి.

## 'ప్రభా'తం

కరోనా కష్టకాలంలో అన్ని వ్యవస్థలూ అస్తవ్యస్తంగా మారిన పరిస్థితుల నుంచి దేశం ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న తరుణంలో వచ్చిన కేంద్ర బడ్జెట్ కొంతలోకొంత ఊరడింపు బడ్జెట్‌గా ఉండడం సంతోషకరం. కోవిడ్ నేర్పిన గుణపాఠాలతో దేశం కష్టనష్టాల పాలవకుండా ప్రధాని మోడీ సారధ్యంలోని ప్రభుత్వం అన్ని విధాలా తగు జాగ్రత్తలు తీసుకుంటూ బడ్జెట్ కేటాయింపుల్లోనూ అచితూచి అడుగు వేస్తున్నట్లు కనిపిస్తోంది. అయినా.. ప్రస్తుతం దేశం ఎదుర్కొంటున్న విపత్కర పరిస్థితులు అన్నిన్ని కావు. కోవిడ్ మూలంగా ఆర్థిక వ్యవస్థ తలకిందులైంది. స్థూల జాతీయోత్పత్తి పడిపోయింది. అభివృద్ధి కరువైంది. లక్షల సంఖ్యలో పరిశ్రమలు మూతపడడంతో కోట్లాది మంది ఉపాధి కోల్పోయారు. వ్యవసాయ రంగం కూడా సంక్షోభంలో పడిపోయింది. అయినప్పటికీ దేశవ్యాప్తంగా పడకేసిన వ్యవస్థలకు టీకా వేసి కోలుకునే విధంగా కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ 'కరోనా ఏడాది' ముగిశాక, ఈ దశాబ్దంలో తొలి బడ్జెట్‌గా ప్రవేశపెట్టిన భారీ బడ్జెట్‌తో కరోనాతో కుదేలైన వ్యవస్థలు తిరిగి కోలుకునేందుకు మార్గం వేసినట్లయింది. 'ఆత్మనిర్భర్' పేరుతో ఈ ఆర్థిక సంవత్సరానికి 34 లక్షల కోట్లకు పైగానే కేటాయిస్తూ భారీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం ఎంతైనా విశేషం. ఇప్పుడున్న సంక్షోభ పరిస్థితుల్లో నిజంగా ఇదొక పెద్ద యజ్ఞమే. ఒకవైపు కరోనా ప్రభావం, మరోవైపు ఆర్థిక పరిస్థితులు, ఇంకోవైపు రైతుల ఉద్యమం వంటివి చుట్టుముట్టి ఉన్నా కేంద్రం ఈ పరిస్థితులన్నిటినీ చక్కబెట్టడానికి సంకల్పించినట్లు ఈ బడ్జెట్ ద్వారా తెలుస్తుంది. కొన్ని ఇబ్బందులు, కొన్ని సమస్యలు, మరికొన్ని నిరాశ నిస్పృహలు ఉన్నా, కొత్తగా సంక్షేమ పథకాలేమీ లేకున్నా.. లేనిపోని ఆర్భాటాలకు పోకుండా ప్రస్తుత సంక్షోభ సుడిగుండం నుంచి.. ఈ కరోనా కల్లోలం నుంచి తేరుకుని దేశం అన్ని రకాలుగా వృద్ధి బాటలో సమృద్ధిని సాధిస్తూ ముందుకు పయనించేందుకు ప్రయత్నించడం ఈ బడ్జెట్ కేటాయింపుల్లో కనిపిస్తుంది. 2020-21 వార్షిక బడ్జెట్ కింద అవసరమైన కీలక రంగాలకు బడ్జెట్‌లో మంచి ప్రాధాన్యతనే ఇచ్చినట్లు తేటతెల్లమవుతోంది. ముఖ్యంగా దేశానికి వెన్నెముక అయిన అన్నదాతలకు ఈ ఏడాది 16.50 లక్షల కోట్ల ఆర్థిక రుణ ప్రతిపాదనలకు మార్గం చూపారు. దీని ద్వారా 43.36 లక్షల మంది సన్న, చిన్నకారు రైతులకు ప్రయోజనం కలుగుతుందని భావిస్తున్నారు. దీంతోపాటు ప్రస్తుత ధర కంటే కనీసం 15 శాతం అధికంగా మద్దతు ధర కల్పిస్తామనే సంకేతాలివ్వడం రైతులకు సంతోషం కలిగించేవేనని చెప్పవచ్చు. సాగుచట్టాలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న రైతాంగానికి కూడా ఈ ప్రతిపాదనలు ఎంతో ఊరటనిచ్చేవే అనుకోవచ్చు. వ్యవసాయ రంగానికి, అనుబంధ రంగాలకు కేటాయింపులను 1,48,301 కోట్లకు పెంచడం రైతులకు సంతోషం కలిగించే విషయమే. అన్నదాతల సంక్షేమానికే ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారి ఆదాయాన్ని రెట్టింపు చేస్తూ అన్నదాతలకు అన్నివిధాలా చేయూతను ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్తూ ఈ బడ్జెట్‌లో పలు వ్యవసాయ పథకాలకు భారీగానే కేటాయింపులు చేయడం గమనార్హం. దీంతోపాటు ఇంతకాలం దేశ ఆరోగ్యరంగాన్ని అల్లకల్లోలం చేసిన కరోనా పనిపట్టడానికి, ఆరోగ్యరంగాన్ని బలోపేతం చేసేందుకు బడ్జెట్‌లో భారీఎత్తున నిధులు కేటాయించడం స్వాగతించదగ్గది. ఆరోగ్య రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి బడ్జెట్‌లో కేటాయింపులు 137 శాతం పెంచడం ఎంతో విశేషమనే చెప్పవచ్చు. అందులోనూ ఇప్పుడు ప్రజలకు అత్యంత ఆవశ్యకమైన కోవిడ్ వ్యాక్సినేషన్‌కు మరో 35వేల కోట్ల రూపాయలను కేటాయించారు కూడా. దేశ రక్షణ రంగానికి, భద్రతా వ్యవస్థకు, స్వచ్ఛభారత్‌కు, రైల్వే లకు, విద్య, వైద్యరంగాలకు బడ్జెట్‌లో కేటాయింపులు మునుపటికంటే పెంచడం సంతోషించ దగ్గ విషయం.

### ఆరోగ్య బడ్జెట్

**కరోనా కష్టకాలంలో అన్ని వ్యవస్థలూ అస్తవ్యస్థంగా మారిన పరిస్థితుల నుంచి దేశం ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న తరుణంలో వచ్చిన కేంద్ర బడ్జెట్ కొంత ఆశాజనకంగానే ఉందని అనుకోవచ్చు. కోవిడ్ నేర్పిన గుణపాఠాలతో దేశం కష్టనష్టాల పాలవకుండా ప్రధాని మోడీ సారధ్యంలోని ప్రభుత్వం అన్ని విధాలా తగు జాగ్రత్తలు తీసుకుంటూ బడ్జెట్ కేటాయింపుల్లోనూ అచితూచి అడుగువేసినట్లు కనిపిస్తోంది. దేశవ్యాప్తంగా పడకేసిన వ్యవస్థలకు టీకా వేసి కోలుకునే విధంగా కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ఈ దశాబ్దంలో తొలి బడ్జెట్‌గా ప్రవేశపెట్టిన భారీ ఆరోగ్య బడ్జెట్‌తో.. ఆరోగ్య రంగంతో పాటు ఇతర రంగాలు కూడా తిరిగి కోలుకుంటాయని ఆశిద్దాం!...**

అయితే, మరికొన్ని కొరతలు, అసంతృప్తులు కూడా ఉన్నాయి. కోవిడ్ సంక్షోభంలో కోట్లాదిమంది వలస కూలీలకు ఎంతో ఆదరువు కల్పించిన జాతీయ ఉపాధి హామీ పథకానికి చాలినంతగా కేటాయింపులు లేకపోవడం, ఈ బడ్జెట్‌లో కేవలం 73 వేల కోట్లు మాత్రమే ఆ పథకానికి కేటాయించడం ఎంతైనా నిరాశ కలిగించే విషయమే. అదేవిధంగా పెట్రోలు, డీజిల్‌కు సెస్‌లు విధిస్తున్నామని, అయినా వీటి ధరలు పెరగవని ఆర్థికమంత్రి చెప్తున్నా, ఆచరణలోకి వచ్చేసరికి ఇవెక్కడ పెరుగుతాయోనని ఆందోళన ప్రజల్లో నెలకొంది. ఇప్పటికే లీటరు పెట్రోలు ధర వంద రూపాయలకు చేరువలో వున్న నేపథ్యంలో వీటి ధరలు ఇంకా పెరిగితే చివరికి నిత్యావసర వస్తువుల ధరలు కూడా భగ్గుమంటాయన్నది సామాన్య ప్రజల ఆవేదన. ఇలాంటి విషయాల్లో మరింత స్పష్టత ఉంటే బావుండేది. ఇకపోతే, ఈ బడ్జెట్‌లో బడుగు జీవుల సంక్షేమానికి, పేద, మధ్యతరగతి ప్రజల జీవనప్రమాణాలు పెంపొందేందుకు అవసరమైన కేటాయింపులు లేకపోవడం సామాన్యులను నిరాశపరిచిందనే చెప్పాలి. కోవిడ్ సంక్షోభంలో కోట్లాదిమంది గ్రామీణ పేదలతో పాటు, పట్టణాల్లో ఉండే పేదలు, కార్మికులు కూడా ఎన్నో బాధలు పడ్డారు. ఇంకా సరైన ఉపాధి లేక శ్రమజీవులెంతోమంది నేటికీ నిత్యం జీవనపోరాటం చేస్తూనే ఉన్నారు. అలాంటివారికి ఉపయోగపడే విధంగా పట్టణ ఉపాధి హామీ పథకం వంటి పథకాలను ఏర్పాటుచేసి ఉంటే ఎంతో కొంత ఊరట కలిగించి ఉండేది. నానాటికీ పెరిగిపోతున్న నిరుద్యోగాన్ని రూపుమాపేందుకు, పేదరికం నివారించేందుకు అవసరమైన కార్యాచరణ పథకాల కోసం కొంతమేరకైనా కేటాయింపులు జరిగి ఉంటే కొంత మేలు జరిగినట్లుండేది. వచ్చే బడ్జెట్‌లో నైనా ఇలాంటి కొరతలు తీరుతాయని ఆశిద్దాం!..

# కోవూరులో దేహదాన సమర్పణ

## స్ఫూర్తిదాయకంగా నిలిచిన మహిళ



రక్తదానం, నేత్రదానం, అవయవ దానం.. సమాజంలో ఇవన్నీ ఎంతో గొప్పవే. మానవతా దృక్పథంతో, నిరుప మానమైన సేవాభావంతో చేసే ఈ దానాల ద్వారా ఎంతోమంది జీవితాల్లో వెలుగులు ప్రసరింపజేసినట్లవుతుంది. అదేవిధంగా దేహదానం కూడా ఇటీవలి కాలంలో ప్రముఖంగా వినిపిస్తోంది. వైద్యవిద్యా బోధనకు, పరిశోధనలకు భావితరాల వారికి ఎంతగానో ఉపకరించే విధంగా, మరణానంతరం తమ దేహ సమర్పణ ద్వారా సమాజానికి ఉపయోగ పడాలనే ఆకాంక్షతో ఇటీవలి కాలంలో పలువురు మహిళలు సైతం ముందుకు వస్తుండడం ఎంతైనా విశేషం. నెల్లూరు లోని పినాకిని దేహసమర్పకుల సంస్థ ద్వారా ఇలా ఇప్పటిదాకా 27 దేహ సమ ర్పణలు జరిగితే అందులో 14మంది స్త్రీలే కావడం మరో విశేషం. అంతేకాదు ఆ దేహ సమర్పకుల సంస్థలో సభ్యులుగా సుమారు 70మంది దాకా ఉంటే అం దులో 40శాతం మంది దాకా మహిళలే కావడం గమనార్హం. కరోనా కారణంగా కొంతకాలంగా నిలుపుదల అయివున్న ఈ కార్యక్రమాలు ఇప్పుడు మళ్ళీ మొదలైనట్లు ఆ సంస్థ నిర్వాహకులు తెలిపారు. తాజాగా ఈనెల 1న కోవూరులోని ఒక మహిళ దేహసమర్పణ స్ఫూర్తిదాయకంగా నిలిచింది. వివరాలిలా ఉన్నాయి.

విడవలూరు మండలం వావిళ్ళ గ్రామ మూలవాసులు కోవూరు శాంతి నగర్ నివాసి, 72 ఏళ్ళ బట్టు సుజాతమ్మ గతనెల 30న మరణించారు. వారసులు ఆమె నేత్రాలను సమర్పించదలిచారు కానీ, వాటి స్వీకరణ కరోనా వల్ల ఆగివున్న పరిస్థితుల్లో మిత్రులు మడపర్తి రవీంద్ర సూచనతో ఆమె కుమారుడు బట్టు మధుసూదనరావుతో తల్లి దేహాన్ని ఈనెల 1న నారాయణ వైద్యశాల శరీర నిర్మాణ శాస్త్ర విభాగం అధిపతి ఆచార్య లట్టుపల్లి హేమకు సమర్పించారు.

ఈ సందర్భంగా దేహదాన సమర్ప ణకు సహకరించిన ఆమె కుటుంబసభ్యు లను అందరూ అభినందించారు. ఇందుకు కోవూరులోని సుభాష్ సేవా సంఘం అధ్యక్షుడు దేవిరెడ్డి సురేష్‌రెడ్డి తోడ్పడగా, కళాశాల సిబ్బంది కొల్లు రమేష్, గొంగి వంశీకృష్ణ సహాయంతో దేహాన్ని తరలిం చారని, పినాకిని దేహ సమర్పకుల సంస్థ ఈ దేహ సమర్పణ కార్యాన్ని కరోనా నేపథ్యంలో ఆ కుటుంబం, వైద్యకళాశాల మధ్య దూరవాణి సహాయంతో సమన్వయ పరచడం ద్వారా నిర్వహించిందని పినా కిని దేహ సమర్పకుల సంస్థ నిర్వాహకులు తిక్కవరపు సుకుమార్ రెడ్డి వివరించారు. కాగా, కోవూరు నుంచి ఇది తొలి దేహ సమర్పణ కాగా, పినాకిని దేహసమర్పకుల సంస్థ నిర్వహణలో ఇది 27వదని నిర్వా హకులు పేర్కొన్నారు.

## మాకు రిజర్వేషన్లు ఇవ్వండి

### - బి.సి సంక్షేమ సంఘం రాష్ట్ర నేత డిమాండ్

చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వాలని సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉల్లిపాయల శంకరయ్య డిమాండ్ చేశారు. గతనెల 31న నెల్లూరు నగరంలోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ బీసీ కులాలు ఎంతోకాలం నుంచి సామాజికంగా ఎంతో వెనుకబడి ఉన్నాయని, బీసీల ద్వారా అధికారంలోకి వచ్చిన పార్టీలు బీసీలను మరచిపోవడం దారుణమని అన్నారు. పార్లమెంట్ సమావేశాల్లో రాజ్యాంగ సవరణ చేసి బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు ఇవ్వాలని కోరారు. బీసీ నాయకులు శివశంకర్, ప్రభాకర్‌రాజు, వెంకట సుబ్బయ్య, సతీష్, పవన్ పాల్గొన్నారు.

# నిమ్మగడ్డను హీరోను చేస్తున్నారు

ఈ-మెయిల్
ప్రజావాణి
@
lawyerpatrika@gmail.com
WhatsApp +91 98663 14741

ఆయన ఒక సాధారణ ప్రభుత్వ అధికారి. ఐఏఎస్ స్థాయిలో ఉన్నాడు కాబట్టి ఉన్నత పదవులలోకి వచ్చాడు. రాష్ట్ర ఎన్ని కల కమిషనర్ అన్నది నిమ్మగడ్డ రమేష్ కుమార్‌కి కొంతకాలం ఉండే పదవి మాత్రమే. రేపు మార్చి 2021 చివరికి ఆయన పదవీవిరమణ కూడా చేయబోతు న్నారు. ఆ తరువాత ఆయన ఎవరో కూడా ఎవరికీ గుర్తుకూడా వుండదు. అలాంటి ఒక సామాన్య ప్రభుత్వ అధికారిని జగన్&కో హీరోని చేస్తున్నారు. ఇప్పటి పరిస్థితుల్లో ఏ ఎన్నికలు జరిగినా వైసిపి క్లీన్‌స్వీప్ చేస్తుంది. మరి అలాంటప్పుడు అనవసరంగా రమేష్‌కుమార్‌కి ప్రాధాన్యతనిచ్చి దేశ స్థాయిలో ఆయన పేరు మారుమ్రోగేలా చేస్తున్నారు. ఇప్పటికైనా నిమ్మగడ్డకు ఇలాంటి అనవసరపు ప్రచారాన్ని కల్పించడం మాని, వైసిపి నాయకులు ఆయన పని ఆయనను చేసుకోనిస్తే, పనులు చక్కబెట్టుకుని మార్చిలో పదవి విరమణ చేసి వెళ్ళిపోతాడు. వీళ్ళు ఇలాగే ఆయనకు అనవసరపు ప్రాధాన్యతను కల్పిస్తే, జగన్మోహన్‌రెడ్డి అంతటి వాడిని తాను గడగడలాడించానని ఆయన జీవితాంతం చెప్పుకుంటాడు.

**- యం.చంద్రమౌళి, కొత్తఢిల్లీ.**

# సంస్కరణ బాట పట్టిన రిజిస్ట్రేషన్ల శాఖ

స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖ ఇన్స్‌పెక్టర్ జనరల్ ఎం.వి.శేషగిరిబాబు సారధ్యంలో ఆ శాఖ నూతన ఒరవడిని సంతరించుకుని ముందుకుపోతున్నది. ఏ శాఖలో పనిచేసినా ఆ శాఖలో అవినీతి, అక్రమాలను రూపుమాపి పారదర్శక పాలన అందించి తద్వారా ఆ శాఖపై తనదైన ముద్రవేసి పరిపాలన సాగించే అధికారి ఎంవి శేషగిరిబాబు. నెల్లూరుజిల్లా కలెక్టర్‌గా సమర్థవంతంగా పనిచేసి జిల్లా ప్రజలకు మెరుగైన సేవలు అందించిన అధికారిగా మెప్పుపొందారు. ప్రస్తుతం స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీగా శేషగిరిబాబు పనిచేస్తున్నారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖను అవినీతి రహితంగా తీర్చిదిద్దేందుకు ఆ శాఖను సంస్కరణల బాట పట్టించారు. స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ అవినీతిలో ప్రథమస్థానంలో ఉందని గతంలో పలు సందర్భాల్లో సాక్షాత్తూ ముఖ్యమంత్రే అభిప్రాయపడ్డారు. ఇటువంటి పరిస్థితుల్లో ఆ శాఖ నూతన ఐజీగా ఎంవి శేషగిరిబాబు ఆ శాఖను సంస్కరించి దిగువస్థాయి వరకు అవినీతి రహితంగా స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ సేవలు ప్రజలకు అందించేందుకు చర్యలు తీసుకోవడం హర్షణీయం.

**- డాక్టర్ ఎస్.బాబురావు, కావలి.**

త్వరలోనే...

# టిడిపి కనుమరుగు కావడం ఖాయం

**- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్న**



త్వరలోనే రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ కనుమరుగు కావడం ఖాయమని, గ్రామాల్లోని టిడిపి నాయకులు అనేకమంది ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చూసి వైకాపాలోకి చేరిపోతున్నారని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. ఈ నెల 1న విడవలూరు మండలంలోని పార్లపల్లికి చెందిన నీటి సంఘం మాజీఅధ్యక్షుడు, టిడిపి నాయకుడు వేగూరు చంద్రారెడ్డి వైకాపాలో చేరారు. అంతకుముందు పార్లపల్లిలోని 30కుటుంబాల వారు, విడవలూరు మండలం చౌకచర్ల గ్రామంలోని పలువురు టిడిపి మద్దతుదారులు దాదాపు 40 కుటుంబాల వారు కూడా వైకాపాలో చేరిపోయారు. వారందరికీ పార్టీ కండువాలు కప్పి స్వాగతించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రసన్న మాట్లాడుతూ కొత్తగా వైకాపాలో చేరిన వారంతా అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. డిసిఎంఎస్ ఛైర్మెన్ వీరి చలపతిరావు, డిఏఏసి ఛైర్మెన్ నిరంజన్‌బాబురెడ్డి, మండల కన్వీనర్ బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, నాయకులు పూండ్ల అచ్యుత్‌రెడ్డి, కాటంరెడ్డి నవీన్‌కుమార్‌రెడ్డి, రామిరెడ్డి విజయ భాస్కర్‌రెడ్డి, పాశం శ్రీహరిరెడ్డి, వేనాటి ప్రసాద్, బద్వేలు శ్రావణ్‌కుమార్‌రెడ్డి, రాజేష్‌లతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.



# విద్యుత్ వాహనాల వినియోగానికి చర్యలు తీసుకుంటున్నాం

**- ఆదాల ప్రశ్నకు కేంద్రమంత్రి ప్రకాష్ జవ్‌దేకర్ సమాధానం**



గత రెండేళ్ళలో విద్యుత్ వాహనాల వాడకాన్ని పెంచేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారంటూ నెల్లూరు ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఈ నెల 2న లోక్ సభలో ప్రశ్నించగా అందుకు కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి ప్రకాష్ జవ్‌దేకర్ బదులిస్తూ 'ఫేమ్ ఇండియా' పథకం కింద విద్యుత్ వాహనాల వినియోగాన్ని పెంచేందుకు కేంద్రప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుందని లిఖితపూర్వకంగా పేర్కొన్నారు. 2015 నుంచి ఈ పథకం అమలులో ఉందని, దీనికోసం కేంద్రప్రభుత్వం 10వేల కోట్ల రూపాయలను కేంద్ర బడ్జెట్‌లో కేటాయించిందని, ఆయా రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో దేశంలో 10 రాష్ట్రాల్లో విద్యుత్ వాహనాల పథకాన్ని అమలుచేస్తున్నామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌తో సహా 10 రాష్ట్రాలు సహకరిస్తున్నాయని, ఇందులో భాగంగా విద్యుత్ బస్సులు, ద్విచక్ర వాహనాలు, ప్యాసింజర్ కార్లు, ద్విచక్రవాహనాలకు చార్జింగ్ సౌకర్యాలకు కృషి జరుగుతోందన్నారు. దీంతో విద్యుత్ వినియోగదారుల్లో కూడా ఉత్సాహం పెరుగుతోందని, ఈ వాహనాలకు జిఎస్టీని కూడా 12 నుంచి 5 శాతానికి తగ్గించామని పేర్కొన్నారు. అదే విధంగా ఎలక్ట్రిక్ ఛార్జింగ్ స్టేషన్లకు కూడా జిఎస్టీ 18 నుంచి 5 శాతానికి తగ్గించామన్నారు. విక్రయానంతర సేవలకు కూడా కార్యాచరణ కార్యక్రమం రూపొందించామని, వ్యక్తిగత పన్ను రాయితీ కల్పించడమే కాకుండా, 16-18 ఏళ్ళ మధ్య యువతకు గేర్ లెస్ వాహనాలకు లైసెన్స్ మినహాయింపు ఇవ్వాలనే విషయం పరిశీలనలో ఉందని పేర్కొన్నారు. విద్యుత్ వాహనాల నిర్వహణ వ్యయం కూడా తక్కువేనని, ఛార్జింగ్‌స్టేషన్ల ఏర్పాటుకు వాణిజ్య భవనాల సౌకర్యాన్ని కల్పించేందుకు కృషి జరుగుతోందని కేంద్ర మంత్రి వివరించారు.

## గ్రామీణ రోడ్ల నిధుల విషయం పరిశీలించారా? - ఆదాల

ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం కింద ఆంధ్రప్రదేశ్‌లో ఏమేరకు నిధులు పెంచుతున్నారని నెల్లూరు ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఈనెల 2న లోక్‌సభలో ప్రశ్నించారు. రాష్ట్రంలో గ్రామీణ రోడ్ల అభివృద్ధి లక్ష్యాన్ని 3285 నుంచి 6135 కిలోమీటర్లకు పెంచాలని చేసిన విజ్ఞప్తిని పరిశీలించారా?..అని ఆయన అడిగారు. అందుకు స్పందించిన కేంద్ర గ్రామీణ అభివృద్ధిశాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమార్ సమాధానమిస్తూ దేశంలో 1.25 లక్షల కిలోమీటర్ల గ్రామీణ రోడ్లను అభివృద్ధి చేసేందుకు లక్ష్యంగా నిర్దేశించామని, అన్ని రాష్ట్రాలకు ఒకే విధానాన్ని అమలుచేస్తున్నామని ఆదాలకు వివరించారు.

# చిన్నపిల్లల ఆరోగ్యం జాగ్రత్త

**అంగన్‌వాడి కార్యకర్తలతో జేసీ ప్రభాకర్‌రెడ్డి**

కోవిడ్ నేపథ్యంలో అంగన్‌వాడి సెంటర్లకు వచ్చే చిన్నపిల్లల ఆరోగ్యం పట్ల అంగన్‌వాడి కార్యకర్తలు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి చెప్పారు. ఈనెల 1న ఆయన నెల్లూరులోని ఏకెనగర్‌లో పున:ప్రారంభమైన అంగన్‌వాడి సెంటర్లను పరిశీలించి అంగన్‌వాడి కార్యకర్తలకు సూచనలు చేశారు. నిర్దేశించిన సమయం ప్రకారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అంగన్‌వాడి కేంద్రాలను నిర్వహించాలని, చిన్నారులకు కొత్త మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని తెలిపారు.




5వ వర్ధంతి

నిష్కల్మష హృదయుడు, నిస్వార్థ సేవాతత్పరుడు,
నిరంతర ప్రజాసేవకుడు

**చిట్టమూరు పద్మనాభరెడ్డి గారు**

(మాజీ వైస్‌ఛైర్మెన్, జిల్లా ప్రజాపరిషత్, నెల్లూరుజిల్లా)
పరమపదించి తేది. 9.2.2021 నాటికి ఐదేళ్ళు గడుస్తాయి.

వారి దివ్యస్మృతికి అంజలి ఘటిస్తూ...

బావమరిది / అల్లుడు - కుమార్తె
ప్రొ॥ సి.యం.కె.రెడ్డి - శ్రీమతి నిర్మల, చెన్నై
కోడలు
డా॥ సి.భారతి, యు.యస్.ఏ
(W/o. లేట్. డా॥ సి.మధుసూదన్‌రెడ్డి)
మనుమరాలు, మనుమడు
ప్రణీత, లోహిత్, యు.యస్.ఏ
మనుమడు - మనుమరాలు
డా॥ సి.యం.కిషోర్ - శ్రీమతి లీలాదేవి, చెన్నై
మనుమరాలు - మనుమడు
శ్రీమతి హారిత - డా॥ రామానందరెడ్డి, కాకినాడ
మునిమనుమలు మునిమనుమరాండ్రు
జయేష్ & అస్మిత    కీర్తన లక్ష్మి & తనవ్

# నెల్లూరు కబుర్లు

## జిల్లా కలెక్టర్‌ను కలసిన ఎన్నికల పరిశీలకుడు



ఎన్నికల పరిశీలకుడు బసంత్‌కుమార్ గతనెల 31న నెల్లూరులోని కలెక్టర్ క్యాంపు కార్యాలయానికి వచ్చి జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబును గౌరవపూర్వకంగా కలుసుకున్నారు. పంచాయితీ ఎన్నికలకు సంబంధించిన అంశాలపై వారు చర్చించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జిల్లా జాయింట్ కలెక్టర్ హరేందిరప్రసాద్ పాల్గొన్నారు.

## ఆదాల సతీమణి దాతృత్వం

### - అంధుల పాఠశాలకు లక్ష విరాళం



అంధుల పాఠశాల కరస్పాండెంట్ ప్రభావతికి ఆదాల వింధ్యావళి పంపించిన లక్ష రూపాయాల విరాళాన్ని అందజేస్తున్న విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి

నెల్లూరులోని విశ్వభారతి అంధుల పాఠశాలకు నెల్లూరు ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి సతీమణి శ్రీమతి ఆదాల వింధ్యావళి లక్ష రూపాయలను విరాళంగా ఇచ్చి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. ఆ మొత్తాన్ని విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి తన మిత్రబృందంతో కలసి వింధ్యావళి తరపున అంధుల పాఠశాల కరెస్పాండెంట్ పోరెడ్డి ప్రభావతికి అందజేశారు. తన జన్మదినం సందర్భంగా వింధ్యావళి మానవతా హృదయంతో అంధ విద్యార్థులకు సాయంగా ఈ విరాళం అందజేసి అందరి ప్రశంసలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ స్వర్ణ వెంకయ్య, కోటేశ్వరరెడ్డి, అబూబకర్, ఇక్బాల్, విజయ డెయిరీ డైరెక్టర్ సునీల్‌రెడ్డి, సాత్విక్ తదితరులు పాల్గొన్నారు. ఆదాల ప్రభాకర్‌రెడ్డి దంపతులు ఎంతో సహృదయంతో గతంలో కూడా అంధుల పాఠశాలకు ఎంతో సాయం అందించారని, వారి మేలును మరువలేమని పాఠశాల కరెస్పాండెంట్ ప్రభావతి ఈ సందర్భంగా అదాల వింధ్యావళికి, ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

## శ్రీ త్యాగరాజస్వామికి వేడుకగా పల్లకి సేవ



నెల్లూరులోని వేదాయపాళెం త్యాగరాజనగర్‌లో ఉన్న శ్రీ త్యాగరాజస్వామి మందిరంలో ఈనెల 2న 174వ సద్గురు నాదబ్రహ్మానంద సరస్వతి శ్రీ త్యాగరాజ స్వామి ఆరాధన మహోత్సవాన్ని ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని శోభాయమానంగా అలంకరించి వేడుకగా పల్లకిసేవ నిర్వహించారు. బ్రహ్మశ్రీ మాచవోలు వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో స్వామి వారికి పంచామృతాభిషేకం, విశేష పూజలు చేపట్టారు. సంగీత కళాకారులతో వీనులవిందుగా పంచరత్న గోష్టి నిర్వహించారు. అనంతరం త్యాగరాజస్వామి భక్తులు, సింహపురి కళాకారుల ఆధ్వర్యంలో నగరంలో భిక్షాటన కార్యక్రమం చేపట్టారు. త్యాగరాజ సేవాసమితి కార్యదర్శి ఎనమండ్ర నాగదేవిప్రసాద్ పర్యవేక్షణలో ఈ పూజలు జరిగాయి.

## ఎస్సీ కార్పొరేషన్ ఇ.డిగా రోజ్‌మాండ్

జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఇన్‌చార్జి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ రోజ్‌మాండ్ నియమితులయ్యారు. ఇప్పటిదాకా తెలుగుగంగ స్పెషల్ కలెక్టర్ మధుసూదనరావు ఈ విధులను నిర్వహిస్తూ గతనెల 31న ఉద్యోగ విరమణ చేయడంతో ఆ స్థానంలో రోజ్‌మాండ్‌ను నియమించారు.

## గిరిజన సంక్షేమ అధికారిగా రోశిరెడ్డి

జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారిగా ఐటిడిఏ అధికారి రోశిరెడ్డికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులిచ్చారు. ఈ స్థానంలో ఇప్పటిదాక పనిచేసిన ఉమాదేవి గత నెల 31న ఉద్యోగ విరమణ చేయడంతో రోశిరెడ్డికి ఈ బాధ్యతలు అప్పగించారు.

## కొత్త కార్యవర్గం

ఏపీ వ్యవసాయ మార్కెట్ కమిటీ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంక్షేమ సంఘానికి గతనెల 31న కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లాశాఖ అధ్యక్షునిగా ఎం.మస్తానయ్య, గౌరవాధ్యక్షులుగా ఏ.దేవసహాయం, ఎం.కల్పన, ప్రధాన కార్యదర్శిగా ఐ.శ్రీకాంత్, కోశాధికారిగా ఎం.మాల్యాద్రిలను ఎన్నుకున్నారు.

## కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోండి

### - మెప్మా పీడీ రవీంద్ర

కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అర్హులైన వారంతా సద్వినియోగం చేసుకుని జీవనస్థాయిని పెంపొందించుకోవాలని మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ రవీంద్ర చెప్పారు. నెల్లూరు నగర పాలక సంస్థ సమావేశ మందిరంలో ఈనెల 1న ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన లబ్ధిదారులతో మాట్లాడుతూ ప్రధానమంత్రి స్వనిధి సమృద్ధ యోజన పథకం కార్యక్రమంలో భాగంగా ప్రతి నెలా మొదటివారంలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటుచేస్తున్నామని, లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇంకా జీవన్‌జ్యోతి, సురక్షబీమా యోజన, ప్రధాన మంత్రి జన్‌ధన్ యోజన, మాతృ వందన యోజన వంటి పలు పథకాల పట్ల అవగాహన పెంచుకుని ఆ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లబ్ధిదారుల దరఖాస్తులను ప్రతిరోజూ ఆన్‌లైన్ విధానంలో కేంద్రప్రభుత్వానికి అప్‌లోడ్ చేస్తామని వివరించారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

## విజయవంతంగా పల్స్ పోలియో

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మూడురోజులపాటు జరిగిన పల్స్‌పోలియో కార్యక్రమం ఈనెల2తో విజయవంతంగా ముగిసింది. నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించి ఈ కార్యక్రమాన్ని జిల్లా వైద్యశాఖ అధికారులు, సిబ్బంది అందరూ కలసి జయప్రదంగా నిర్వహించడం ఎంతైనా అభినందనీయం.

జిల్లాలో తొలిరోజైన ఆదివారం బూత్‌స్థాయిలో 3,32,337 మందికి, రెండవ రోజైన సోమవారం 7,279 మందికి, మూడవ రోజు మంగళవారం 2,118 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. నిర్దేశించిన లక్ష్యానికంటే మించి 101.09 శాతం నమోదుకావడం విశేషం.

## ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

### అధికారులను ఆదేశించిన కలెక్టర్

ఎన్నికల ప్రక్రియను పటిష్టంగా నిర్వహించడంలో ఎన్నికల అధికారులదే కీలకపాత్ర అని, ఎన్నికల విధుల్లోని అధికారులు ఎంతో అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు సూచించారు.

ఈనెల 2న నెల్లూరులోని జడ్పీ ప్రాంగణంలో ఎన్నికల అధికారులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల నామినేషన్ నోటీసు జారీ చేసినప్పటి నుంచి ఎన్నికల ఫలితాలు ప్రకటించే దాకా అధికారులు అప్రమత్తంగా ఉంటూ ఎక్కడా ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ జరిగే సమయంలో వచ్చిన ఓటర్లు ఓటర్ల లిస్టులో ఉన్నవాళ్ళేనా అనే విషయాన్ని గమనించి, అర్హులైన ప్రతిఒక్కరూ ఓటు వినియోగించుకునేలా చూడాలన్నారు. ప్రజాస్వామ్యంలో పంచాయితీ ఎన్నికలు ఎంతో కీలకమైనవని, పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియను నిర్వహించి ప్రజలు స్వచ్ఛంధంగా పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటింగ్‌లో పాల్గొనేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ఎన్నికల నియమావళిని, నిబంధనలను అనుసరించి అందరూ పనిచేయాలన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎన్నికల సంఘం విధివిధానాలను కలెక్టర్ అధికారులకు వివరించి దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయితీ అధికారి ధనలక్ష్మి తదితర అధికారులు పాల్గొన్నారు.

## వైద్యవిద్యలో... సత్తా చాటుతున్న విశ్వసాయి విద్యార్థులు

### -- ఉత్తమ ఫలితాలు సాధించినందుకు ప్రతిభా పురస్కారాలు --



నెల్లూరులోని విశ్వసాయి విద్యాసంస్థల విద్యార్థులు విద్యలో ఎంతో ప్రతిభతో రాణిస్తూ తమ సత్తా చాటుకుంటున్నారు. వందలాది మంది విద్యార్థులు ఎంబిబిఎస్ సీట్లు సాధించడమే కాక ఇంకా అనేక విభాగాల్లోని విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తూ అందరి ప్రశంసలు అందుకుంటున్నారు.

ప్రతిభాపాటవాలతో రాణిస్తున్న విద్యార్థులను అభినందిస్తూ గతనెల 31న విశ్వసాయి విద్యాసంస్థల వారు అనేకమంది విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేశారు. నెల్లూరు నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో విశ్వసాయి ఛైర్మెన్ డా.ఎన్ సత్యనారాయణ మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు ఎంతో పట్టుదలతో విద్యలో ఉత్తమ ఫలితాలు సాధిస్తుండడం తమకెంతో సంతోషంగా ఉందన్నారు. కోవిడ్ సంక్షోభంలోనూ నిబంధనలు పాటిస్తూ ఆన్‌లైన్ విద్య ద్వారా విశ్వసాయి విద్యార్థులు ఉత్తమస్థాయిలో ఫలితాలు సాధిస్తున్నారని అన్నారు. మెడికల్‌లో ఇప్పటిదాకా 7 వందల సీట్లు సాధించామని, ప్రత్యేకించి ఈ ఏడాది 107 మెడికల్ సీట్లు సాధించడం జరిగిందన్నారు. ఇంజనీరింగ్‌లోనూ జాతీయస్థాయి జెఇఇ అడ్వాన్స్ పరీక్షల్లోనూ 11వ ర్యాంకుతో పాటు తమ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఒక దివ్యాంగ(మూగ బధిర) విద్యార్థిని సైతం ఐఐటిలో సీటు సాధించిన ఘనత విశ్వసాయిదేనన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యూరాలజిస్ట్ డా.సుజయ్ సదా, ప్రముఖ సాంకేతిక నిపుణుడు జి.సుధాకర్ పాల్గొని ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న విశ్వసాయి విద్యార్థులను అభినందించారు. విద్యార్థులకు ఉత్తమ స్థాయి విద్యాబోధన చేయడంలో విశ్వసాయి తీసుకుంటున్న శ్రద్ధ, చొరవను కొనియాడారు. అత్యుత్తమ బోధనలో రాష్ట్రంలో విశ్వసాయి ప్రత్యేక గుర్తింపును తెచ్చుకుందని కొనియాడారు. విద్యార్థులంతా ఉన్నత చదువుల్లో రాణించి క్రమశిక్షణతో, నీతి నిజాయితీలతో మరింత ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. కళాశాల వైస్‌ఛైర్మెన్ జి.కృష్ణమోహన్‌రావు, ఛైర్‌పర్సన్ ఎన్.రుక్మిణి, ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సచివాలయాల ద్వారా మెరుగైన విద్యుత్ సేవలు

### - విద్యుత్‌శాఖ ఎస్ఇ కొండా ఆదిశేషయ్య



వినియోగదారులకు విద్యుత్ సేవలను మరింత అందుబాటులోకి తెచ్చేందుకు విద్యుత్ శాఖ నిరంతరం కృషి చేస్తోంది. సచివాలయ వ్యవస్థ ద్వారా ఇప్పుడు దాదాపు 56 రకాల విద్యుత్ సేవలు అందిస్తున్నామని, వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆ శాఖ ఉన్నతాధికారులు కోరుతున్నారు. విద్యుత్‌శాఖ ఎస్ఇ కొండా ఆదిశేషయ్య ఈనెల2న నెల్లూరులోని గౌతమ్‌నగర్‌లో ఉన్న సచివాలయాన్ని పరిశీలించడానికి వచ్చినప్పుడు ఆయన ఈ విషయం చెప్పారు. అన్నివర్గాల విద్యుత్ వినియోగదారులకు సౌకర్యవంతమైన విద్యుత్ సేవలను అందుబాటులోకి తీసుకురావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇళ్ళకు, వాణిజ్యపరమైన వినియోగదారులకు అవసరమైన కొత్త సర్వీసులు పొందేందుకు, కేటగిరి మార్పులు పేరు సవరణ, ఫేజ్ మార్పిడి వగైరాల వివరాలను కంప్యూటర్‌లో పొందుపరచిన తర్వాత సకాలంలో వినియోగదారులకు ఆ సేవలందించే విధంగా చూడాలని ఆయన సిబ్బందికి సూచించారు. ప్రతి సచివాలయంలోనూ విద్యుత్‌శాఖకు సంబంధించి ఒక ఎనర్జీ అసిస్టెంట్ ఉంటారని, లేనిచోట రెగ్యులర్ సిబ్బందిని నియమిస్తామని ఆయన పేర్కొన్నారు. సచివాలయ విద్యుత్ ఉద్యోగులంతా బాధ్యతగా పనిచేసి శాఖాపరమైన లక్ష్యాలను సాధించేందుకు కృషిచేయాలని చెప్పారు.

# పనితీరు భేష్.. సదుపాయాలు శెభాష్

## - శ్రీసిటీకి ఉత్తరాఖండ్ ఉన్నతాధికారుల ప్రశంసలు



అటు పనితీరులోనూ, ఇటు అంతర్జాతీయస్థాయిలో పరిశ్రమలకు అవసరమైన అత్యుత్తమమైన మౌలికసదుపాయాలు అందించడంలోనూ ఇప్పటికే శ్రీసిటీ తనదంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. దేశవ్యాప్తంగానే కాక, అంతర్జాతీయ స్థాయిలోని అనేక పరిశ్రమల మేధావులు శ్రీసిటీని సందర్శిస్తూ శ్రీసిటీ పనితీరును కొనియాడుతూనే ఉన్నారు.

ఇటీవలే ఉత్తరాఖండ్ నుంచి పలువురు ఉన్నతాధికారుల బృందం శ్రీసిటీలో పర్యటించి, ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలతో, వ్యాపారానుకూల వాతావరణంతో శ్రీసిటీ చక్కని ప్రణాళికతో ముందుకు సాగుతోందని అభినందించింది. గతనెల 30న ఉత్తరాఖండ్ రాష్ట్ర మౌలిక వసతులు, పారిశ్రామిక అభివృద్ధి సంస్థ (ఎస్ఐఐడిసియుఎల్) ఉన్నతాధికారుల బృందం జనరల్ మేనేజర్ ప్రకాష్చంద్ర దుమ్కా ఆధ్వర్యంలోని బృందం శ్రీసిటీని సందర్శించింది. ఈ సందర్భంగా ప్రకాష్ చంద్ర మాట్లాడుతూ శ్రీసిటీ తమనెంతో ఆకట్టుకుందని, చక్కని లక్ష్యాలతో.. మంచి వ్యాపారాభివృద్ధితో కొనసాగుతోందని అభినందించారు. తొలుత వీరిని శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సాదరంగా స్వాగతించి శ్రీసిటీ ప్రగతిని, ప్రత్యేకతలను వివరించారు. శ్రీసిటీ ప్రాజెక్టు మోడల్ను దేశంలోని ఇతర రాష్ట్రాల పారిశ్రామిక మౌలిక వసతుల అభివృద్ధి సంస్థలు అధ్యయనం చేయడం తాము గౌరవప్రదంగా భావిస్తున్నామని, వారి పరిశీలనలు ఆయా రాష్ట్రాల్లో ఉన్నతస్థాయి ప్రాజెక్టుల ఏర్పాటుకు దోహదం చేస్తాయని భావిస్తున్నామని ఆయన ఆకాంక్షించారు. ఆ బృందంలో ఫైనాన్షియల్ కంట్రోలర్ జగత్సింగ్చౌహాన్, ప్లానింగ్ డైరెక్టర్ లోకేష్ శర్మ, ఆర్కిటెక్ట్ ప్లానర్ వైఎస్ పుండిర్, ఇన్వెస్ట్మెంట్ ప్రమోషన్ ప్రోగ్రామ్ మేనేజర్ కన్వాన్ విజయ్, సభ్యుడు అభినవ్ గౌతం తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక చట్టాల్లో సంస్కరణలు అభినందనీయం




కేంద్ర ప్రభుత్వ నూతన కార్మిక చట్టాలపై శ్రీసిటీలో గతనెల 29న రాష్ట్ర ఉన్నతాధికారులతో చర్చ జరిగింది. రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, పరిశ్రమల విభాగం ముఖ్య కార్యదర్శి బి.ఉదయలక్ష్మి, రాష్ట్ర పరిశ్రమల డైరెక్టర్ డి.చంద్రశేఖర్ వర్మతో పాటు జిల్లా చీఫ్ డెప్యూటి ఫ్యాక్టరీస్ ఇన్స్పెక్టర్ ఎంవి శివకుమార్రెడ్డి, శ్రీసిటీలోని పలువురు సీనియర్ మేనేజర్లు పాల్గొన్నారు. పరిశ్రమల యాజమాన్యాలు, ఉద్యోగులు, కార్మికుల సంక్షేమం కోసం కేంద్రప్రభుత్వం 29 పాత కార్మిక చట్టాల్లో మార్పులు చేసి, నాలుగు కొత్త లేబర్కోడ్లను ప్రవేశపెట్టిందని, ఇందులో కార్మికుల జీతభత్యాలు, సామాజిక భద్రత, పారిశ్రామిక సంబంధాలు, వృత్తి భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితులు అనే అంశాలున్నాయని పరిశ్రమల ముఖ్య కార్యదర్శి బి.ఉదయలక్ష్మి చెప్పారు. శ్రీసిటీ ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ సామాజిక భద్రతను పెంచడానికి కార్మిక చట్టాల సంస్కరణలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల చొరవ అభినందనీయమన్నారు. ఈ ప్రాంతంలోని కార్మికులకు, వారి కుటుంబాలకు ఉపయోగపడేలా నూరు పడకల ఇఎస్ఐ ఆసుపత్రి నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ఆయన పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శిని కోరారు. శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్(కస్టమర్ రిలేషన్స్) రమేష్కుమార్ అధికారులకు స్వాగతం పలికారు.

# నేతన్నలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ... అండగా ఉంటుంది

## వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి



సంప్రదాయ వస్త్ర తయారీలో దేశానికి గర్వకారణమైన కీర్తిని తెచ్చిపెట్టిన చేనేత రంగాన్ని, అనుబంధ వృత్తుల వారిని అన్నివిధాలా ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, నేతన్నలు ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని మాజీమంత్రి, వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి అన్నారు.

గతనెల 31న ఆయన నెల్లూరులోని తన నివాసంలో తనను కలసిన చేనేత నాయకులతో మాట్లాడారు. చేనేతరంగంలో ఎదురవుతున్న ఇబ్బందులను నాయకులు ఈ సందర్భంగా ఆనం దృష్టికి తీసుకురాగా నేతకారుల సమస్యలు తీరేందుకు తనవంతు కృషిచేస్తానని ఆయన చెప్పారు. చేనేత రంగానికే తలమానికంగా ఉంటున్న వెంకటగిరి నియోజకవర్గంలోని చేనేతకారులకు ఆర్థిక చేయూతనిచ్చి వారి జీవితాలకు భరోసా కల్పించేందుకు, చేనేత సొసైటీలను బలోపేతం చేసేందుకు కృషి చేస్తామన్నారు. అదేవిధంగా స్థానికంగా నైపుణ్యాభివృద్ధి కేంద్రం ఏర్పాటుకు కూడా రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి మేకపాటి గౌతంరెడ్డితో చర్చిస్తామని చెప్పారు.

# ఆర్యవైశ్యసంఘం అర్బన్ అధ్యక్షునిగా సీతారామారావు

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా ఆర్యవైశ్య సంఘం అర్బన్ అధ్యక్షునిగా పేర్ల సీతారామారావు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈనెల 1న నెల్లూరులోని పాండురంగ అన్నదాన సమాజంలో జరిగిన సమావేశంలో ఈ ఎంపిక చేశారు. రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు, మాజీ డెప్యూటి మేయర్ ముక్కాల ద్వారకానాథ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సాధుప్రతాప్, భవిరిశెట్టి రామారావు, ముచ్చర్ల రామకోటేశ్వరరావు పర్యవేక్షణ అధికారులుగా వ్యవహరించారు. అనంతరం కొత్త అధ్యక్షునిగా ఎంపికైన పేర్ల సీతారామారావుకు ముక్కాల ద్వారకానాథ్ నియామకపత్రాన్ని అందజేసి అభినందించారు.




ద్వితీయ వర్ధంతి

మంచి వ్యక్తిత్వం... అందరికీ మేలు చేయాలనే తత్వం...
మానవీయ మనస్తత్వం కలిగిన మా ఇంటి దైవం, మా తండ్రిగారైన

శ్రీ కొండూరు వెంకట్రామిరెడ్డి గారు

స్వర్గస్తులై తే.08.02.2021ది నాటికి రెండేళ్ళు గడవనున్న సందర్భంగా
ఆ పవిత్రమూర్తిని సంస్మరించుకుంటూ...

కుమారుడు: కొండూరు శేషారెడ్డి, అడ్వకేట్
కోడలు: కొండూరు ఉషాలక్ష్మి
మనుమడు: చేరుపాటి హర్షవర్ధన్రెడ్డి
మనుమరాలు: చేరుపాటి ప్రతిమ
మునిమనుమడు: చేరుపాటి జతిన్ సిద్ధార్థరెడ్డి
మునిమనుమరాలు: చేరుపాటి సరోజిని

# మరీ ఇంత అరాచకమా!..

## - వైకాపా నాయకులపై సోమిరెడ్డి ఆగ్రహం



పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో వైకాపా నాయకులు అరాచకాలకు, బెదిరింపులు దౌర్జన్యాలకు దిగుతున్నారని, టిడిపి తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థులపై దాడులకు కూడా పాల్పడుతున్నారని, మరీ ఇంత అరాచకమా అని మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వైకాపా నాయకుల తీరుపై మండిపడ్డారు. ఈనెల1న ఆయన వెంకటాచలంలోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ వైకాపా నాయకులకు పోలీసులు, రెవెన్యూ అధికారులు వంతపాడుతున్నారని ఆరోపించారు. ఇది మంచిపద్ధతి కాదన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో టిడిపి వారినే బైండోవర్ చేసుకుంటున్నారని, ఇదెక్కడి న్యాయమని ప్రశ్నించారు. ఎవరెవరు ఎంతెంత అవినీతికి పాల్పడుతున్నారో తమ వద్ద ఆధారాలున్నాయని, త్వరలోనే వాటిని బయటపెడతామన్నారు. టిడిపి హయాంలో లోడింగ్, ట్రాక్టర్ బాడుగ మినహా ఇసుకను ఉచితంగా ఇస్తే, ఇప్పుడు ట్రక్కు ఇసుక దాదాపు 7వేలకు చేరిందని దుయ్యబట్టారు. గ్రావెల్, మట్టి, ఇసుక దోపిడీ యధేచ్ఛగా జరుగుతుంటే సంబంధిత అధికారులు ఏం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. వైకాపా అరాచకాలను సహించేది లేదని, టిడిపి మద్దతుదారులు ధైర్యంగా ఉండాలని ఆయన అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ, తిరుపతి పార్లమెంట్ ఉప ఎన్నికల్లోనూ వైకాపాకి ప్రజలు గుణపాఠం చెప్పాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

# ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో ఎన్‌సిసి క్యాడెట్ల ఎంపిక



విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో ఇటీవల ఎన్‌సిసి నావెల్ యూనిట్ క్యాడెట్స్‌కి ఎంపికలు జరిగాయి. ఈ కార్యక్రమంలో 120 మంది యువకులు, 40 మంది మహిళలు పాల్గొన్నారు. వారికి నెల్లూరు 10(ఎ) నావల్ యూనిట్ ఎన్‌సిసి కార్యాలయం నుండి వచ్చిన వీరభద్రారెడ్డి, వై.బాబు సమక్షంలో శారీరక పరీక్షలు నిర్వహించి యూనిట్ క్యాడెట్స్‌గా కొంతమందిని ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డా. విజయకుమార్‌రెడ్డి, పి.డిలు మల్లికార్జునరెడ్డి, కె.శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ ఆధ్వర్యంలో.. గాంధీ వర్ధంతి



గతనెల 30న గాంధీ వర్ధంతి సందర్భంగా గూడూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో లయన్స్ జిల్లా గవర్నర్ చింతా రమేష్‌నాథరెడ్డి తన అధికారిక పర్యటనలో భాగంగా గూడూరుకు వచ్చి స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ విశిష్టత గురించి జరిగిన వ్యాసరచన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులిచ్చారు. ఈ సందర్భంగా పాఠశాలకు పోడియంను బహుకరించారు. తొలుత గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీ సరస్వతి శిశుమందిరంలో లయన్స్‌క్లబ్ సభ్యుల సహకారంతో నిర్మించిన ప్రహరీగోడను ప్రారంభించి, పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్యాబినెట్ కార్యదర్శి కె.నాగేశ్వరరెడ్డి, గూడూరు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎం.రూపేష్‌రెడ్డి, జోన్ ఛైర్మెన్ ఏ.వి సత్యనారాయణ, వి.కాంతారావు, డిస్ట్రిక్ట్ ఛైర్మెన్స్ లయన్ ఎస్‌కె రియాజ్ అహమ్మద్, లయన్స్ వి.రామ మోహన్, ఎం.మురళీరెడ్డి, ఎస్‌వివిఎల్ ప్రసాద్, ఎస్ చెంచురామయ్య, ఎం.రమణయ్య, ఏ. రమణయ్య, జె.శ్రీనివాసులురెడ్డి, ఆర్‌వి చంద్ర, టి.మురళీరెడ్డి, కె. రజనీకాంత్‌రెడ్డి, సుకుమార్‌రెడ్డి, కార్యదర్శి ఎ.కల్యాణ్‌సాయి, కోశాధికారి పివి జగదీష్‌చంద్ర పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్ వార్తలు

## పంచాయితీకి సిద్ధంగా ఉండండి



గూడూరు పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం గూడూరు సబ్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ స్థానిక సంస్థల ఎన్నికలపై నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మూడో విడతలో గూడూరు డివిజన్‌లో పంచాయతీ ఎన్నికలు జరుగుతాయని, అధికారుల నియామకం కూడా పూర్తయ్యిందన్నారు. ఆరో తేదీ నుండి నామినేషన్‌ల ప్రక్రియ మొదలవుతుందని పేర్కొన్నారు. ప్రతి అధికారి తమ విధులను సక్రమంగా నిర్వహించాలన్నారు. అనంతరం అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో గూడూరు డి.ఎస్.పి రాజగోపాల్‌రెడ్డి, నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## నిరాడంబరంగా..
## సబ్‌కలెక్టర్ గోపాలకృష్ణ పుట్టినరోజు

గూడూరు సబ్‌కలెక్టర్ గోపాలకృష్ణ తన పుట్టినరోజు వేడుకను గతనెల 31న గూడూరులోని అనేకమంది నిరాశ్రయులు, పేదల మధ్య నిరాడంబరంగా జరుపుకున్నారు. మై ఫ్రండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, మెప్మా, మునిసిపాలిటీ వారి సౌజన్యంతో నిర్వహిస్తున్న వసతి గృహంలోని నిరాశ్రయుల మధ్య కేకు కట్‌చేసి వారి తల్లిదండ్రుల చేతుల మీదుగా కొత్త దుస్తులు, భోజనం ప్లేట్లు, వంట సామగ్రి, కూరగాయలు అందించారు. ఈ వసతి గృహాన్ని మై ఫ్రండ్స్ అసోసియేషన్ వారు చాలా పరిశుభ్రంగా నిర్వహిస్తున్నారని ఆయన అభినందించారు. మై ఫ్రండ్స్ అసోసియేషన్ సభ్యులు శ్రీవత్స, విష్ణు, సమీవుల్లా, ప్రశాంత్, రాకేష్, రమేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## రైతు వ్యతిరేక చట్టాల
# రద్దుకు పోరాటం



రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేసేంతవరకు పోరాటం ఆగదని రైతు సంఘం ఉపాధ్యక్షుడు శ్రీరాములు తెలిపారు. గూడూరు పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాల సముదాయ ప్రాంతంలో ఢిల్లీలో రైతులు చేస్తున్న దీక్షలకు మద్దతుగా వామపక్షాలు, కాంగ్రెస్‌పార్టీ, వివిధ సంఘాల నాయకుల సంయుక్త ఆధ్వర్యంలో గత నెల 30వ తేదీ నిరసన దీక్షను చేశారు. వివిధ పార్టీల నాయకులు యాదగిరి, కుమార్, మణి, కేశవులు, పరిమల వెంకటేశ్వర్లు, శ్రీనివాసాచారి, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు. మరోపక్క కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద రైతు చట్టాలను రద్దు చేయాలని నిరసన, ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటగిరి నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌ఛార్జి శ్రీనివాసులురెడ్డి, సర్వేపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, భవన నిర్మాణ కార్మిక సంఘం సీనియర్ నాయకుడు పుట్టా శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులు కష్టపడి చదువుకుని
# సమాజంలో ఉన్నతంగా రాణించాలి

విద్యార్థులు బాగా చదువుకుని సమాజంలో ఉన్నతంగా రాణించాలని డాక్టర్ సిఆర్‌రెడ్డి, డాక్టర్ రోహిణి ఆకాంక్షించారు. గతనెల 31న యోగి వేమన జయంతి సందర్భంగా గూడూరులోని రెడ్డి సంక్షేమసంఘం ఆధ్వర్యంలో స్థానిక డిఎస్‌ఆర్ హాల్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వారు పాల్గొని పద్యపఠనం, వక్తృత్వ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లా



డుతూ విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా ఉంటున్న రెడ్డి సంక్షేమ సంఘాన్ని వారు అభినందించారు. సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం కేంద్ర కమిటీ అధ్యక్షుడు వరిదిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు బుసిరెడ్డి దశరథరామిరెడ్డి, మహిళా ఉపాధ్యక్షురాలు డాక్టర్ రోహిణి, కార్యదర్శులు కలికి జనార్దన్‌రెడ్డి, దేసిరెడ్డి ప్రజేంద్ర రెడ్డి, 1వ పట్టణ ఉపాధ్యక్షుడు రాధాకృష్ణారెడ్డి, 2వ పట్టణ అధ్యక్షుడు ఏలూరు రామకృష్ణారెడ్డి, కార్యదర్శి టి.సురేష్‌రెడ్డి, సహాయ కార్యదర్శి శ్రీనివాసులురెడ్డితోపాటు వెంకటగిరి, కావలి రెడ్డి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## భారత దేశ
# ఔన్నత్యాన్ని చాటింది బౌద్ధమే!

**- నాగిశెట్టి ధర్మయ్య**



భారతదేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటింది బౌద్ధమేనని వక్తలు అన్నారు. గతనెల 31న బాలయపల్లి మండలంలోని గొట్టికాడు గ్రామంలో సద్ధర్మ బుద్ధ విహార్ 12వ వార్షికోత్సవం సందర్భంగా రాష్ట్ర షెడ్యూల్డు కులాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాగిశెట్టి ధర్మయ్య మాట్లాడుతూ బుద్ధుని ఆవిర్భావంతో ప్రపంచ దేశాలు శాస్త్రీయ దృక్పథంతో కూడుకున్న శాంతి సుఖమయ జీవనానికై బౌద్ధ భారతదేశం వైపు చూడడం ప్రారంభించాయన్నారు. ప్రముఖ బాలసాహితీవేత్త డా. గంగిశెట్టి శివకుమార్ మాట్లాడుతూ భారతదేశ జీవన విధానం బౌద్ధజీవన విధానమేనని, క్రీస్తుపూర్వం 2600 సంవత్సరాలకు పూర్వమే బౌద్ధ విశ్వవిద్యాలయాలు పదికి పైగా విస్తరించి వర్ధిల్లాయంటే బౌద్ధం ఎంత గొప్పదో అర్థమవుతుందని అన్నారు. ఏపిఎస్‌పిడిసిఎల్ వెంకటగిరి ఏడిఇ పిట్టి మునిచంద్ర మాట్లాడుతూ బుద్ధుని బోధనలను ప్రతి ఒక్కరూ అధ్యయనం చేయడం ద్వారా వ్యక్తిత్వ వికాసం పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో వేమూరు రమణయ్య, కె.ఓబులేసు, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

ఈ సందర్భంగా బాలాయపల్లి మండలంలోని వివిధ గ్రామాల పాఠశాలల్లో నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు.


గ్రంథ సమీక్ష

# శ్రీ వెంకయ్యస్వామి మహత్మ్యాన్ని చాటే..'అగ్ని స్వరూపుడు'

'ఆకలైన వారికి అన్నం పెట్టాలయ్యా.. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలయ్యా'.. అంటూ మానవాళికి మహనీయమైన బోధనలు చేసిన మహా మానవతా మూర్తి అవధూత, భగవాన్ శ్రీశ్రీశ్రీ వెంకయ్యస్వామి వారు. ఒక్క మనుషులనే కాదు, చివరికి చీమలు, కుక్కలు, కాకుల పట్ల కూడా శ్రీ స్వామివారు ఎంతో దయ చూపేవారు. ప్రతి జీవిలోనూ పరమాత్మ ఉన్నాడంటూనే 'అన్ని జీవుల్లో వెంకయ్య ఉన్నాడని రాసుకోండయ్యా' అంటూ తన దైవత్వాన్ని స్వామివారు చెప్పకనే చెప్పారు. మానవాళికి తన సద్బోధనలతో మార్గదర్శనం చేసిన మహనీయుడు, అవధూత భగవాన్ శ్రీ వెంకయ్యస్వామివారు. అలాంటి స్వామివారి జీవితం, బోధనలు, మహిమలు తదితర విషయాలపై ఇప్పటికే కొన్ని పుస్తకాలు వచ్చాయి. ఆ వరుసలో 'అగ్ని స్వరూపుడు' కూడా మంచి విశిష్టమైన గ్రంథం. స్వామివారిని గురించి ఎన్నో ఆసక్తికరమైన విషయాలను తెలియజేసే గ్రంథం ఇది.

నెల్లూరుకు చెందిన ఈ గ్రంథ రచయిత దంపూరు రామకృష్ణ రెవెన్యూ శాఖలో ఉద్యోగం చేస్తున్న రోజుల్లో పలు ప్రాంతాల్లో పర్యటించారు. 1989 ప్రాంతంలో మిత్రులతో కలసి గొలగమూడికి వెళ్ళి భగవాన్ శ్రీ వెంకయ్యస్వామివారి సమాధిని దర్శించుకుని అలౌకికానందాన్ని అనుభవించిన రామకృష్ణ, 1990లో తన గురువైన కీ.శే రామావఝుల శ్రీశైలంతో కలసి 'అవధూత జ్యోతి' అనే పుస్తకాన్ని స్వామివారి సంక్షిప్త వివరాలతో వెలువరించారు. అప్పటినుంచి చాలా ఏళ్ళుగా స్వామివారి వివరాలు, భక్తుల అనుభవాలు సేకరించడమే పనిగా పెట్టుకున్నారు. జిల్లా అంతటా పర్యటించి 32 మండలాల్లో వెలసివున్న 125 వెంకయ్యస్వామివారి ఆశ్రమాల విషయాలను కూడా సేకరించారు. ఫోటోలు తీశారు. వాటన్నింటిని ఏర్చికూర్చి 'అగ్ని స్వరూపుడ'నే గ్రంథంగా వెలయించారు.

'ఈ పుస్తక రచనలోను, విషయ సేకరణలోను నా గొప్ప ఏమీ లేదు. శ్రీ స్వామివారు ఈ కార్యక్రమాన్ని పూర్తిచేసేందుకు ఒక సాధనంగా నన్ను ఎన్నుకున్నారు'..అంటూ రచయిత రామకృష్ణ ఎంతో




రచన : దంపూరు రామకృష్ణ
వెల : రూ. 100/- పేజీల : 271
ప్రతులకు:
భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి ఆశ్రమం
గొలగమూడి గ్రామం, వెంకటాచలం మం॥,
ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరుజిల్లా.

వినయంగా ప్రకటించుకున్నారు. అది పూర్తి వాస్తవం కూడా. అంతటి వినయశీలి గనకనే అద్భుతంగా గ్రంథాన్ని రచించగలిగారు. 'అవధూత భగవాన్ శ్రీ వెంకయ్యస్వామివారి లీలలు అనంతం. అందులో ఇసుమంతైనా భక్తులకు అందించాలన్నదే నా ప్రయత్నం' అన్నారు రచయిత ఎంతో వినయంగా.

శ్రీ వెంకయ్యస్వామివారు ఒక అవధూత అని రచయిత తెలుపుతూ 'అవధూత' లక్షణాలను ఇలా తెలిపారు. 'జగత్తంతా పరమాత్మ అని భావిస్తూ, దేహాభిమానం లేక ఎల్లవేళలా ఆ పరమాత్మ చింతనలోనే ఉండేవారిని అవధూత అంటారు' అని పేర్కొన్నారు. పై నిర్వచనం అవధూత భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి వారికి సరిగ్గా సరిపోతుంది.

అవధూత శ్రీ వెంకయ్యస్వామివారు నిరంతరం అగ్నిగుండం వెలిగించేవారు. అందువల్ల రచయిత స్వామివారిని 'అగ్ని స్వరూపుడు'గా భావించారు. అదే పేరును ఈ గ్రంథానికి పెట్టారు. అంతేగాక, అగ్ని గురించి వేదాల్లో, ఉపనిషత్తుల్లో, పురాణాల్లో, దేశ విదేశాల్లో అత్యంత ప్రాచీన కాలాల నుంచి ఉన్న భావనల్ని రచయిత క్రోడీకరించారు. 'ఎంతటి విస్తృత పరిశోధన!'..అన్న ఆశ్చర్యం ఈ గ్రంథం చదివే ప్రతి పాఠకుడిలో మెదులుతుంది. రచయితలో రచనా శక్తే గాక, గొప్ప పరిశోధనా పాటవం ఉన్నట్లు అర్థమవుతుంది.

శ్రీ వెంకయ్యస్వామివారు కొలువై ఉండే 125 ఆలయాల గురించి తెలియజేయడమే కాక, ఆ ఆలయాలున్న గ్రామాల చరిత్రను కూడా సంక్షిప్తంగా వివరించారు రచయిత. ఇది ఆయనకు చరిత్రమీదున్న ఆసక్తిని తెలియజేస్తుంది. మరీ ఆశ్చర్యం ఏమంటే ఆయన ఏ కళాశాలలోనో ప్రొఫెసర్ కాకపోయినా, ఎంతో బాధ్యతగల రెవెన్యూ అధికారిగా ఉద్యోగం చేస్తూ, వృత్తికి సంబంధం లేని ప్రవృత్తి అయినప్పటికీ తన ఉద్యోగాన్ని తాను శ్రద్ధతో చేసుకుంటూనే ఏళ్ళ తరబడిగా ఎంతో వ్యయప్రయాసలకోర్చి బాగా పరిశోధన చేసి ఈ గ్రంథాన్ని రచించడం ఎంతైనా అభినందనీయం.

ఈ గ్రంథాన్ని రచించడానికి రచయిత రామకృష్ణ పలు ఆధ్యాత్మిక గ్రంథాలను అధ్యయనం చేశారు. అనేకమంది స్వామివారి భక్తులను కలసి వారి అనుభవాలను సేకరించి గ్రంథానికి నిండుదనం చేకూర్చారు. భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి ఆశ్రమ కమిటీ వారు సర్వాంగసుందరంగా ఈ గ్రంథాన్ని వెలుగులోకి తేవడం ఎంతైనా అభినందనీయం. రచయిత అన్నట్లుగానే ఇదంతా భగవాన్ శ్రీ వెంకయ్యస్వామివారి కృప. ఆ స్వామి కరుణతోనే రామకృష్ణ ముందు ముందు మరెన్నో చక్కని ఆధ్యాత్మిక గ్రంథాలను వెలువరిస్తారని ఆశిద్దాం!...



సమీక్ష : డా. గంగిశెట్టి శివకుమార్
9441895343

## జొన్నవాడ కామాక్షమ్మ సేవలో
# కలెక్టర్ దంపతులు



జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని జొన్నవాడలో కొలువైవున్న శ్రీ మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారిని గతనెల 31న జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు సకుటుంబంగా వచ్చి దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఇ.ఓ ఏ.వి శ్రీనివాసులురెడ్డి, ఆలయ అర్చకులు కలెక్టర్ దంపతులకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజల అనంతరం ఆలయ అర్చకులు కలెక్టర్ దంపతులకు స్వామివార్ల తీర్థ ప్రసాదాలను అందజేశారు. కలెక్టర్ వెంట తహాశీల్దార్ షఫీమాలిక్, ఆలయ పాలకమండలి సభ్యులు మధుసూదన్‌రెడ్డి, ప్రమీల, నరసింహారావు పాల్గొన్నారు.

## శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారికి..
# భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన

కోవూరులోని పాటూరురోడ్డులో ఉన్న శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం 22వ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా గతనెల 31న అమ్మవారికి ఎంతో భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో దేదీప్యమానం చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు మనోహర్‌శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి శాస్త్రోక్తంగా పూజలు జరిగాయి. మహిళాభక్తులు పెద్దసంఖ్యలో సామూహిక లక్ష కుంకుమార్చనలో పాల్గొని అమ్మవారిని అర్చించుకున్నారు. అనంతరం అమ్మవారికి పంచామృతాభిషేకాలు నేత్రపర్వంగా నిర్వహించి, ఆ తర్వాత చందనంతో అమ్మవారిని శోభాయమానంగా అలంకరించారు. ఆలయ ధర్మకర్తలు ఆలూరు శ్రీనివాసులురెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అయిదు శతాబ్దాల నాటి.. శ్రీ వైద్య వీరరాఘవస్వామి దేవాలయం

***నెల్లూరు నగరంలో ఎంతో ప్రసిద్ధి చెందిన ఆలయం శ్రీ వైద్య వీరరాఘవ స్వామి దేవాలయం. దాదాపు అయిదు శతాబ్దాల నాటి ఈ ఆలయం చరిత్రాత్మకమైనదే కాక..ఎంతో మహిమాన్వితమైనది కూడా. ప్రత్యేకించి ఇక్కడ కొలువైవున్న శ్రీ వీర రాఘవస్వామి ఆరోగ్యప్రదాతగా ప్రతీతి. ఈ దేవాలయానికి ఎంతో ఆసక్తికరమైన చరిత్ర ఉంది. ఈ స్వామి ఆవిర్భావం.. ఎంతో చరిత్ర ప్రసిద్ధిచెందిన వేమాలశెట్టి బావి చరిత్రతో ముడిపడి ఉండడం విశేషం.***

నెల్లూరుసీమలోని అత్యంత ప్రాచీనమైన ఆలయాల్లో శ్రీ వైద్య వీరరాఘవస్వామి ఆలయం ఒకటి. నెల్లూరు నగరంలోని దర్గామిట్టలోని రామ్‌నగర్‌లో ఉన్న వేమాలశెట్టి బావి ప్రాంగణంలో ఈ దేవాలయం ఉంది. తిరువళ్ళూరులో ఉన్న ప్రసిద్ధమైన శ్రీ వీరరాఘవస్వామి దేవాలయంలో ఉన్న విధంగానే ఇక్కడ కూడా స్వామి రూపం అత్యంత అద్భుతంగా ఉండి భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటుంది. ఎంతోమంది భక్తులు తమ వ్యాధుల నివారణ కోసం, తమ కష్టాలు తొలగిపోవడం కోసం, తమ కోర్కెలు నెరవేరడం కోసం శ్రీ వైద్య వీరరాఘవస్వామిని భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తుంటారు. చూడచక్కని గోపురంతో శ్రీ వైద్య వీరరాఘవస్వామి ఆలయంతో పాటు ఇక్కడున్న వేమాలశెట్టి బావి ప్రాంగణమంతా విశాలంగా, సుందరంగా ఉంటుంది. శ్రీ స్వామివారికి నిత్యం పూజలు, సేవలు జరుగుతుంటాయి. ఆలయం ముంగిట్లో ఉన్న నవగ్రహ మండపం చుట్టూ భక్తులు ప్రదక్షిణలు చేసుకుని పూజలు చేస్తుంటారు.

## తిరునాళ్ళను తలపించే..'తై అమావాస్య'

శ్రీ స్వామివారికి ఎంతో ప్రీతిపాత్రమైన 'తై అమావాస్య' పుణ్యదినం వస్తే చాలు వేమాలశెట్టి బావి ప్రాంగణంతో పాటు చుట్టుపక్కల వీధులన్నీ భక్తజనసంద్రంగా మారిపోతాయి. కిలోమీటర్ల దూరం భక్తులు క్యూ కట్టి వేమాలశెట్టి బావిలో బెల్లం






మన దేవాలయాలు (32)

సమర్పించుకుని మొక్కులు మొక్కుకుంటుంటారు. పుష్యమాసం బహుళ అమావాస్యనే 'తై అమావాస్య' అని, అదే చోళంగి అమావాస్య అని కూడా అంటుంటారు. ఆరోజున వేమాలశెట్టి బావిలో బెల్లం వేసి భక్తితో పూజలు చేయడమేకాక, శ్రీ వైద్య వీరరాఘవస్వామికి ప్రత్యేక పూజలు చేస్తారు. ఆలయం ఎదురుగా ఉన్న బలిపీఠం వద్ద ఉప్పు, మిరియాలు పోసి భక్తులు తమ కోర్కెలను స్వామివారికి నివేదించుకుంటూ ఉండడం ఎంతోకాలంగా వస్తున్న ఆనవాయితీ. అలా చేస్తే తమ కోర్కెలు నెరవేరుతాయని భక్తులు గట్టిగా విశ్వసిస్తుంటారు. ఈ ఏడాది కూడా ఫిబ్రవరి 11వ తేది 'తై అమావాస్య' వస్తుంది కనుక ఈ ప్రశస్త్యమైన రోజున వేమాలశెట్టి బావి వద్దకు వేలసంఖ్యలో భక్తులు వచ్చి స్వామివార్లకు తమ మొక్కులు తీర్చుకుంటారు. ఇలా శతాబ్దాల తరబడి వేమాలశెట్టి బావి నెల్లూరు చరిత్రలోనే ఒక ప్రత్యేకతను సంతరించుకుంది. చరిత్రాత్మకమైన, మహిమాన్వితమైన శ్రీ వైద్య వీరరాఘవస్వామి ఆలయం భక్తుల పూజలందుకుంటోంది.

## చరిత్ర ప్రసిద్ధి చెందిన వేమాలశెట్టి బావి :



నెల్లూరులో వేమాలశెట్టి బావికి ఎంతో ఘనమైన చరిత్రే ఉందని పెద్దలు చెప్తున్నారు. ఆ వివరాలిలా ఉన్నాయి... ఎప్పుడో 16వ శతాబ్దంలో ఈ ప్రాంతంలో నివసిస్తున్న చిన్ని వేమాలయ్య, వేమాలమ్మ అనే దంపతులు ఈ ప్రాంతంలోని ప్రజల దాహార్తి తీర్చేందుకు ఇక్కడ ఒక బావిని తవ్వించారు. అయితే ఎంత లోతుగా తవ్వినా కూడా ఆ బావిలో నీరు పడలేదు. దీంతో శ్రీ స్వామివారు ఒక వృద్ధుని రూపంలో ఆ పుణ్యదంపతులకు ప్రత్యక్షమై, మీరిరువురు తవ్విన ఆ బావిలోపల నిద్రించమని చెప్పడం, వారు అలాగే చేయడం, ఆ మరుసటి రోజు నుంచి ఆ దంపతులు కనపడకపోవడం, బావిలో నిండుగా నీళ్లు చేరడం జరిగాయి. ఆనాటి నుంచి ప్రజలు వేమాలశెట్టి పుణ్యదంపతులను దేవత లుగా ఆరాధిస్తున్నారు. వేమాలశెట్టి బావిగా ప్రసిద్ధి చెందిన ఆ బావిలో నేటికీ నిండుగా నీరు ఉంటుంది. నాటి నుంచి ఈ బావి వద్ద శ్రీస్వామి వారికి ప్రశస్థమైన తై అమావాస్య రోజున వేలాదిగా భక్తులు పాల్గొని బావిలో బెల్లం వేసి తమ మొక్కు బడులు తీర్చుకుంటున్నారు. ఈ బావి పక్కనే ఆరోగ్యప్రదాతగా ప్రఖ్యాతిచెందిన శ్రీ వైద్య వీరరాఘవస్వామి ఆలయం కొలువై ఉంది. మొత్తంగా వేమాలశెట్టి బావి ప్రాంగణమంతా ఒక పవిత్ర ప్రదేశంగానే కాక, ఎంతో మహిమ గల ప్రాంతంగా ప్రఖ్యాతి చెందడం విశేషం.

# వ్యవస్థలతో ఆడుకుంటున్నారు

(మొదటి పేజీ తరువాయి)

తాను స్పీకర్‌ని కలిసి మాట్లాడుతానని, గవర్నర్‌కి అప్పీల్ చేసుకునే అవకాశం ఇవ్వాలని ఎస్ఈసీ నందలాల్ కోరినా అంగీకరించకపోవడం విశేషం. చివరకు 2008 మార్చి 27, 28 తేదీలలో ఆయన సాధారణ జైలు జీవితం గడపాల్సి వచ్చింది.

తదుపరి ఈ అంశంపై న్యాయస్థానాల్లో విచారణ కూడా జరిగింది. ఆర్టికల్ 21ని ఉల్లంఘించారని సుప్రీంకోర్టులో నందలాల్ పిటీషన్ వేశారు. అయితే ప్రివిలేజ్ కమిటీ నిర్ణయం ఆధారంగా మహారాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ తీసుకున్న నిర్ణయాన్ని కోర్టు సమర్థించింది. పలుమార్లు అవకాశం ఇచ్చినా కమిటీ ముందు హాజరుకావడంలో ఎస్ఈసీ విఫలమయ్యారని, చర్యలు సమంజసమేనని వ్యాఖ్యానించింది.

ప్రస్తుతం రాష్ట్రంలో కూడా ఇదే జరుగుతుందన్న కథనాలు విస్తృతంగా ప్రచారంలో ఉన్నాయి. అయితే అసలు నిమ్మగడ్డ గవర్నర్‌కి రాసిన లేఖలో మంత్రుల ప్రస్తావన శాసన సభ్యుల హక్కులకు భంగం వాటిల్లిందా లేదా అన్న సమర్థనతో పాటు ఆయన శిక్షార్హుడేనని స్పీకర్ భావిస్తే ఇది జరగడం అసాధ్యమేమీ కాదు. ఆ దిశగానే ప్రభుత్వం అడుగులు వేస్తోంది కూడా.

## ఏ.పి మంత్రులు ఏమని ఫిర్యాదు చేశారో గమనిస్తే...

పురపాలక శాఖా మంత్రి బొత్స సత్యనారాయణ, గ్రామీణాభివృద్ధి శాఖామంత్రి పెద్దిరెడ్డిలు రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ ఎస్ఈసీ నిమ్మగడ్డ రమేష్‌కుమార్ జనవరి 27వ తేదీన గవర్నర్‌కి లేఖ రాశారు. తనపై పరిధికి మించి వ్యాఖ్యలు చేస్తున్నారని, విమర్శలు చేస్తున్నారని ఈ లేఖలో పేర్కొన్నారు. ఈ లేఖకి గవర్నర్ స్పందించకపోతే తాను అత్యున్నత ధర్మాసనాన్ని ఆశ్రయిస్తానని పేర్కొన్నారు. ఇది తమను అవమానించడం, గవర్నర్‌ని బెదిరించడమేనని మంత్రులు ఆరోపిస్తున్నారు. ఆ లేఖనే ఆధారంగా చేసుకుని ఏపీ అసెంబ్లీ రూల్ 173 ప్రకారం ప్రివిలేజ్ కమిటీకి మంత్రులు బొత్సా సత్యన్నారాయణ, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఫిర్యాదు చేశారు.

సభలో సభ్యుల హక్కులకు భంగం వాటిల్లిందని భావిస్తే ఫిర్యాదు చేసే అవకాశం రూల్173 కింద ఉంది. సభలో మాత్రమేకాకుండా, బయట కూడా సభ్యులకు సంబంధించి ప్రోటోకాల్ సహా అన్ని అంశాలలోనూ ఈ రూల్ వర్తిస్తుంది. ఏపీ అసెంబ్లీలో సభ్యులుగా ఉన్న మంత్రులిద్దరూ తమ హక్కులకు భంగం వాటిల్లేలా ఎస్ఈసీ లేఖ రాశారని పేర్కొంటున్న తరుణంలో దానిని విచారణకు స్వీకరించే అంశంలో ఏపీ అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారామ్ దానిని ప్రివిలేజ్ కమిటీకి పంపించారు. కమిటీ నిబంధనల ప్రకారం నిర్ణయం తీసుకుంటుందని కమిటీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. మంత్రుల ఫిర్యాదుని పరిగణనలోకి తీసుకుని, వివరణ కోరేందుకు నోటీసులు ఇవ్వడం వంటి చర్యలు తీసుకునే అవకాశం కమిటీకి ఉంటుందని మీడియాతో ఆయన అన్నారు.

## ప్రివిలేజ్ కమిటీ పాత్ర ఎంత

ఎస్ఈసీ మీద మంత్రులు చేసిన ఫిర్యాదులను ఏపీ అసెంబ్లీ ప్రివిలేజ్ కమిటీ పరిశీలించింది. ప్రివిలేజ్ కమిటీ అధ్యక్షుడు, వైసీపీ ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. వర్చువల్ పద్ధతిలో జరిగిన ఈ సమావేశానికి నలుగురు సభ్యులు మాత్రమే హాజరయ్యారు.

ఈ కమిటీలో టీడీపీ తరపున సభ్యుడిగా ఉన్న అనగాని సత్యప్రసాద్ ఈ నోటీసులపై చర్చను తప్పుబట్టారు. ఆర్టికల్ 243కే ప్రకారం నిమ్మగడ్డ లేఖ రాసి ఉంటారని పేర్కొన్నారు. అయితే కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాత్రం దానిని తోసిపుచ్చుతూ ఇది ఎస్ఈసీ హక్కులకు సంబంధించిన అంశం కాదని, మంత్రులిచ్చిన ఫిర్యాదులపై చర్చించాలని సూచించారు.

రెండు రాజ్యాంగ వ్యవస్థల మధ్య వివాదం కావడంతో దానిపై న్యాయపరమైన అన్ని అంశాలను ప్రస్తావించాల్సి ఉంటుందనే అభిప్రాయానికి ప్రివిలేజ్ కమిటీ వచ్చింది. దానికి తగ్గట్టుగా కమిటీ ప్రత్యక్ష సమావేశం కావాలని నిర్ణయానికి వచ్చారు. త్వరలోనే లోతుగా చర్చించిన తర్వాత ఎస్ఈసీకి నోటీసులు ఇవ్వాలా లేదా అన్న నిర్ణయానికి వస్తారని అసెంబ్లీ వర్గాలు చెబుతున్నాయి. ఈ సందర్భంగా మహారాష్ట్రలో ఎస్ఈసీకి సంబంధించి జరిగిన అనుభవాన్ని సభ్యులు చర్చించారు.

"మమ్మల్ని సంజాయిషీ అడగలేదు. వివరణ కోరలేదు. కనీసం మా తీరు మీద ముఖ్యమంత్రితో మాట్లాడలేదు. ఏకంగా గవర్నర్ గారికి లేఖ రాశారు. గవర్నర్‌ని బెదిరించేలా లేఖ ఉంది. మీరు స్పందించకపోతే ఫైనల్‌గా కోర్టుకి పోతానని ఆయన గవర్నర్‌ని బెదిరించారు. మాకు న్యాయం జరగాలి. మమ్మల్ని అగౌరవపరిచేలా ఎస్ఈసీ వ్యవహరించారు. ఈ విషయంలో చర్యలు తీసుకోవాలని స్పీకర్‌ని కోరాము. తగిన రీతిలో స్పందిస్తారని ఆశిస్తున్నాం" అని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మీడియాకు తెలిపారు.

## అతి చేస్తే ఎన్నికలు రద్దు చేస్తానంటోన్న నిమ్మగడ్డ

మరోవైపు నిమ్మగడ్డ వ్యవహార శైలి పైనా తీవ్ర విమర్శలు ఉన్నాయి. కడపకి వెళ్లి దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేరు ప్రస్తావిస్తూ ఆయనను పొగిడి పరోక్షంగా జగన్‌ని విమర్శించడం నుంచి పదవీ విరమణ తర్వాతా సీబీఐ కేసుల్లో సాక్ష్యం చెప్తానంటూ నిమ్మగడ్డ చేసిన వ్యాఖ్యలు ఆయన పరిధిని ప్రశ్నించాయి. రాజ్యాంగబద్ధ పదవిలో ఉండి ఇలాంటి రాజకీయ వ్యాఖ్యలు చేయడం తీవ్ర విమర్శలకు గురిచేసింది.

## మరోవైపు దూకుడుగా వ్యవహరిస్తోన్న నిమ్మగడ్డ

ఇప్పటికే జిల్లాల పర్యటనలతో అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ... తాజాగా ఫిర్యాదుల కోసం అంటూ ఆవిష్కరించిన యాప్ విశ్వసనీయత పైనా ప్రభుత్వం అనుమానాలు వ్యక్తం చేసింది. ఎన్నికల నిర్వహణ కోసం అంటూ ఇ-వాచ్ యాప్‌ను ఆవిష్కరించిన నిమ్మగడ్డ.. అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. యాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను అరగంటలో పరిష్కరించాలంటూ డెడ్‌లైన్ విధించారు. తీవ్రమైన ఫిర్యాదులకు అరగంటలో పరిష్కారం చూపి కేటగిరీ-2లోకి మార్చాలని.. అలా చేయకుంటే సీరియస్ యాక్షన్ తీసుకుంటామన్నారు. ముఖ్యంగా జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు నిత్యం అప్రమత్తంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఎక్కడైనా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుంటే అక్కడ ఎన్నికలను రద్దు చేస్తామని హెచ్చరించారు.

## యాప్‌పై హైకోర్టులో ప్రభుత్వం లంచ్ మోషన్ పిటిషన్

ఎన్నికల నిర్వహణ కోసం ఎస్ఈసీ నిమ్మగడ్డ రమేష్ కుమార్ ఆవిష్కరించిన ఇ-వాచ్ యాప్ పై రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు వెళ్లింది. యాప్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్న ప్రభుత్వం... యాప్‌ను నిలిపేయాలంటూ హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేసింది. యాప్ వినియోగంపై స్టే ఇవ్వాలని పిటిషన్లో పేర్కొంది. ఈ పిటిషన్ నేడో, రేపో విచారణకు రానుంది. ఇప్పటికే పంచాయతీరాజ్ శాఖకు సంబంధించిన యాప్‌లు ఉంటే ప్రత్యేకంగా యాప్‌ను డిజైన్ చేయాల్సిన అవసరమేంటని రాష్ట్ర ప్రభుత్వం ప్రశ్నిస్తోంది. ప్రభుత్వంతో సంప్రదించకుండా రూపొందించిన యాప్‌పై తమకు అభ్యంతరాలున్నాయని పేర్కొంది.

ఇన్ని పరిణామాల నేపథ్యంలో ఇద్దరి వ్యక్తిగత ఆధిపత్యం వ్యవస్థల మధ్య ఆటగా మారి దేశం దృష్టిని ఆకర్షించి తెలుగు సీరియల్స్‌ని మైమరపించే ట్విస్ట్‌లతో విజయవంతంగా సాగుతోంది.

# జగన్‌కు మేలు చేస్తున్న నిమ్మగడ్డ?!

ఇదేంటీ... ఈ స్టేట్‌మెంటు ఏదో తిరకాసుగా ఉందీ అనుకుంటే... బ్యాలెట్ బాక్స్‌లో కాలు వేసినట్టే. ముఖ్యమంత్రి జగన్‌కి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఎలా మేలు చేస్తున్నారో చూద్దామిప్పుడు.

గ్రామ పంచాయతీల ఎన్నికల్లో వీలైనన్నీ ఎక్కువగా సర్పంచ్ పదవులు ఏకగ్రీవం కావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి తలపోస్తున్నారు. అలా ఏకగ్రీవంగా సర్పంచ్‌ని ఎన్నుకున్న గ్రామానికి అయిదు నుంచి 20 లక్షల వరకు నజరానాను ఇస్తున్నట్టు ప్రభుత్వం పునరుద్ఘాటించింది. ఎన్నికల పేరిట గ్రామాలలో జరగడానికి అవకాశం ఉన్న కొట్లాటలు, దొమ్మీలు, ఇంకా శృతి మించితే మర్డర్‌లు నివారించడం కోసం అన్నట్టుగా వైసీపీ ప్రభుత్వం ఈ ఏకగ్రీవాల వైపు మొగ్గుచూపింది.

సర్పంచ్ స్థాయిలో- గ్రామీణులలో ఈ ప్రతిపాదన పట్ల ఓ సానుకూలాభిప్రాయం ఉంటే... నిజానికి ఇది ఓ ఉత్తమమైన ప్రతిపాదన. ప్రభుత్వం ఇచ్చే నజరానా - గ్రామంలో ఊరి వారందరికీ ఉపయోగపడే ఒక మంచి సౌకర్యానికి ఈ సొమ్మును వినియోగించుకోవచ్చు. పైపెచ్చు, తన ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ కార్యకలాపాలను తన సర్పంచ్‌లు సమర్థంగా పర్యవేక్షిస్తూ, తనకు, తన ప్రభుత్వానికీ ప్రజలలో మంచి పేరు తెస్తారని కూడా ముఖ్యమంత్రి భావిస్తూ ఉండి ఉండవచ్చు.



అయితే, మన గ్రామీణ ప్రాంతాలలో అత్యధిక శాతం రాజకీయంగా జనం కూడా నిట్టనిలువుగా చీలిపోయి ఉన్నారనే విషయం రహస్యం ఏమీ కాదు. రాష్ట్ర స్థాయిలో అధికార- ప్రతిపక్ష రాజకీయ పార్టీల మధ్య నెలకొని ఉన్న పరిస్థితులే- జిల్లా, మండల, గ్రామ, వార్డు స్థాయి ప్రజలలో కూడా నెలకొని ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో... అధికార పార్టీ వారే ఎక్కువ శాతం ఏకగ్రీవంగా ఎన్నికయ్యే పరిస్థితి ఉన్నదన్న అనుమానంతో ఆ ఏకగ్రీవాలను ప్రతిఘటించడానికి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్ కుమార్ సమాయత్తం అవుతున్నారు.




నిజానికి, మన దేశంలో కేంద్ర... లేదా... రాష్ట్రాల ఎన్నికల కమిషనర్‌లకు మన రాజ్యాంగం అపరిమిత అధికారాలను కల్పించింది. వీటిని కేంద్ర ప్రభుత్వంగానీ రాష్ట్ర ప్రభుత్వాలు గానీ నిలువరించలేవు. ఎన్నికల కమిషన్ల అధికార పరిధిలో జోక్యం చేసుకుంటే... హైకోర్టులు గానీ, సుప్రీమ్ కోర్టు గానీ ఊరుకోవు. అయినప్పటికీ ఎన్నికల కమిషనర్లు - ప్రభుత్వాల అభిమతాలకు... సర్వ సాధారణంగా ఎదురు వెళ్లరు. వాళ్లూ మానవమాత్రులే కదా! మనందరికి మల్లేనే- వారికీ పెళ్ళాం బిడ్డలూ... ప్రభుత్వాలతో సవా లక్ష అవసరాలూ ఉంటూనే ఉంటాయ్. అందువల్ల, తొందరపడి ప్రభుత్వానికి వారు ఎదురు వెళ్ళరు. కానీ, ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వానికీ - ఎస్ఈసీకి మధ్య గత ఏడాది మార్చ్‌లో ఏర్పడిన "కమ్యూనికేషన్ గ్యాప్" రోజు రోజుకూ అడయార్ మర్రిచెట్టులాగ పెరిగిపోతూ వచ్చింది. ఈ కమ్యూనికేషన్ గ్యాప్ అనేది- ప్రజాస్వామిక వ్యవస్థలలో ఊహించడానికి సైతం సాధ్యం కాని స్థాయికి చేరిపోయింది. హైకోర్టూ, సుప్రీమ్ కోర్టూ కూడా- రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు దన్నుగా నిలబడ్డాయి. ముందు, ముందు నిలబడతామని కూడా చెప్పాయి. అందువల్లనే, మరో55 రోజుల్లో పదవీ విరమణ చేయవలసి ఉన్న నిమ్మగడ్డ రమేష్- రాష్ట్ర పొలిటికల్ ఎగ్జిక్యూటివ్‌తో ఢీ కొంటున్నారు. బస్తీ మే సవాల్ అంటున్నారు.

ఆయన ఏ ఉద్దేశంతో జగన్ అభిమతాన్ని అడ్డుకుంటున్నప్పటికీ జగన్‌కు మేలే చేస్తున్నారు అని నేను అనుకుంటున్నాను.

నిజానికి, స్థానిక సంస్థలలో అధికారాన్ని (చెక్ పవర్‌నూ) చేజిక్కించుకున్నవారిలో ఎక్కువ శాతం మంది - తొలి రోజు నుంచే తమ ప్రతాపం చూపించడం మొదలుపెట్టడాన్ని మనం గమనించే ఉంటాం. ఇప్పుడు నిధులు కూడా బాగా పెరిగి, రాజకీయం నిట్టనిలువుగా చీలిపోయి ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో- (అధికారపార్టీ అభ్యర్థిగా) ఏకగ్రీవంగా ఎంపికయిన సర్పంచ్- ఆ గ్రామానికి సర్పంచ్‌గా మాత్రమే వ్యవహరించరు. మండల ప్రెసిడెంట్‌గా, జిల్లా పరిషత్ చైర్మన్‌గా, ఎం.ఎల్.ఏగా, ఎం.పీగా, ఎస్.ఐగా, సీ.ఐ.గా, వీలైతే డీఎస్పీగా, ఎం.ఆర్.ఓగా, ఆర్.డీ.ఓగా, కలెక్టర్‌గా, మంత్రిగా, వీలైతే ముఖ్యమంత్రిగా కూడా బిహేవ్ చేస్తారు. "మన పార్టీ వారేగా..." అని అధికార పార్టీ పెద్దలు కూడా చూసీ, చూడనట్టు వదిలేస్తారు. అధికారులు కూడా నోళ్లు వెళ్లబెట్టి చూస్తుంటారు తప్ప, నోరు ఎత్తరు.

కానీ, వారి వ్యవహార శైలి వల్ల ప్రజలలో చోటుచేసుకునే అసహనం, ఏమీ చేయలేని నిస్సహాయత, నిర్వేదం, లోపల్లోపలే పేరుకుపోయే కడుపు మంట- చివరకు ప్రభుత్వాధినేతపై ప్రతిఫలిస్తాయి. ఎందుకంటే, గ్రామ స్థాయిలో - అధికార పార్టీ బలపరిచిన సర్పంచే -ఆ గ్రామస్థుల దృష్టిలో ప్రభుత్వ ప్రతినిధి. ముఖ్యమంత్రి ప్రతినిధి.

గ్రామాలలోని వివిధ కేటగిరీలకు చెందిన పేద ప్రజలకు అందిస్తున్న సంక్షేమ ఫలాల వల్ల ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి సమకూరే మంచి పేరును ఈ ఏకగ్రీవ సర్పంచ్‌లు హరించేస్తారు. తేనె వేసుకు మరీ నాకేస్తారు. వారి పాప భారం అంతా జగన్ మీద పడిపోతుంది.

ఇంకో రెండున్నర, మూడేళ్లలో అధికారం రెన్యూవల్ చేయించుకోడానికి -ప్రజల వద్దకు జగన్ వెళ్ళాలి. అప్పటికి, ఏకగ్రీవ సర్పంచుల భారం జగన్‌పై గణనీయంగా పడుతుంది.

జగన్‌కు ఆ అదనపు భారం లేకుండా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ చర్యలు తీసుకుంటున్నారు. కేవలం ఇదే పనిగా ఆయన జిల్లాలు పర్యటిస్తున్నారు. వెళ్లిన చోటల్లా అధికార యంత్రాంగాన్ని పొగుడుతూ, ప్రభుత్వాధినేతలను మాత్రం విమర్శిస్తున్నారు. వీలయినంత వినయంగా మాట్లాడుతూనే, తన అధికారాలకు ఎదురు లేదని చెబుతున్నారు. ఇదీ ఒక వ్యూహమే. ఏకగ్రీవంగా ఎన్నికవుదాములే అనుకుంటున్న ఆశావహులపై లాజికల్‌గా నీళ్లు జల్లుతున్నారు. ఈ వ్యూహం వల్ల, అంతిమంగా లాభపడేది మాత్రం ముఖ్యమంత్రే. వైసీపీ సంగతి తేల్చుదాం అనుకుంటూ, తీసుకుంటున్న పలు చర్యల వల్ల జగన్‌కు "వ్యతిరేక మిత్రుడు" గా నిమ్మగడ్డ రమేష్ రాష్ట్ర ఎన్నికల చరిత్రలో మిగిలిపోనున్నారు.

- భోగాది వేంకట రాయుడు
bhogadirayudu2152@gmail.com

## గాంధీజీకి ఘన నివాళి

మహాత్మాగాంధీ 74వ వర్ధంతి సందర్భంగా గతనెల 30న నెల్లూరులోని మహాత్మాగాంధీ విగ్రహానికి పలువురు వైశ్యప్రముఖులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అంతర్జాతీయ వైశ్య సమాఖ్య ఉపాధ్యక్షుడు కెవి చలమయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వారు పాల్గొని మహాత్ముని సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ వైశ్యసమాఖ్య అర్బన్ డెవలప్‌మెంట్ వైస్‌ఛైర్మెన్ ఆర్‌వి శరత్, పబ్లిక్ రిలేషన్స్ కమిటీ వైస్ ఛైర్మెన్ జెవికె బాబు, సర్వీస్ కమిటీ వైస్‌ఛైర్మెన్ ఎస్.నాగేశ్వర రావు, టూరిజం కమిటీ ఛైర్మెన్ నగరకంటి రవీంద్ర, సోమిశెట్టి వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

# కొనసాగుతూనే ఉన్న కరోనా కల్లోలం

- **ప్రపంచవ్యాప్తంగా 11కోట్లకు చేరువలో బాధితులు**
- **ఇప్పటికే 22.65 లక్షల మంది దాకా కన్నుమూత**

ప్రపంచవ్యాప్తంగా కరోనా కల్లోలం కొనసాగుతూనే ఉంది. ఒకవైపు కోవిడ్ నిరోధానికి భారత్‌తో సహా ప్రపంచంలోని అనేక దేశాలు వ్యాక్సినేషన్ కార్యక్రమాల్లో తలమునకలై ఉంటే, మరోవైపు కరోనా వీరవిహారం చేస్తూనే ఉంది. ఈనెల 3వ తేది నాటికి ప్రపంచంలో 10 కోట్లా 45 లక్షల మందికి పైగానే కరోనా బారినపడ్డారని, ఇప్పటికే 22 లక్షలా 65వేల మంది దాకా ఈ మహమ్మారి వ్యాధికి బలైపోయారని ప్రపంచ ఆరోగ్యసంస్థ నివేదికలు వెల్లడిస్తున్నాయి. అయితే వైద్యుల చికిత్సలతో 7కోట్లా 64లక్షల మందికి పైగానే ఈ వ్యాధి నుంచి కోలుకోవడం సంతోషకరం. మరో 2.58 కోట్ల మంది చికిత్సలు పొందుతున్నారు కూడా. అత్యధిక కేసులు అమెరికాలో నమోదవుతున్నాయి. లక్షలాదిగా ప్రజలు ఈ వ్యాధితో మరణించారు. మరణాల సంఖ్య గణనీయంగా పెరుగుతూనే ఉంది. మనదేశంలోనూ కోవిడ్ కేసుల సంఖ్య కోటీ 7 లక్షలు దాటింది. ఇప్పటిదాకా ఈ వ్యాధితో కోటీ 54లక్షలా 596 మంది కన్నుమూసినట్లు సమాచారం. కరోనా బారినపడిన వారిలో కోటీ 4 లక్షల మందికిపైగానే కోలుకున్నారని, మరో లక్షా 60 వేల మందిదాకా వివిధ ఆసుపత్రుల్లో చికిత్సలు పొందుతున్నారని గణాంకాలు చెప్తున్నాయి.


### వ్యాక్సినేషన్‌లో భారత్ ముందంజ

కరోనా మహమ్మారిని నివారించడానికి ప్రపంచంలోనే అత్యధిక వేగంతో భారత్‌లో వ్యాక్సినేషన్ కార్యక్రమం కొనసాగుతుండడం ఎంతైనా హర్షదాయకం. 18 రోజుల్లోనే 40 లక్షల మందికి పైగానే కరోనా టీకా అందజేయడం జరిగిందని, ఫిబ్రవరి 1వ తేది నాటికి కరోనా వ్యాక్సినేషన్‌లో ప్రపంచంలోనే ముందున్న తొలి అయిదు దేశాల్లో భారత్ కూడా ఒకటిగా నిలుస్తుందని కేంద్ర ఆరోగ్యశాఖ చెప్తోంది. కరోనా నుంచి కోలుకునేవారి సంఖ్య కూడా పెరుగుతోందని, మరణాల సంఖ్య తగ్గుతోందని, ఈ వ్యాధి రికవరీ రేటు 97.08 శాతంగా ఉందని, ప్రపంచంలోని అత్యధిక రికవరీ రేట్‌లలో ఇది కూడా ఒకటని కేంద్ర ఆరోగ్యశాఖ పేర్కొంటోంది.

## దేశంలో రెండవ అతిపెద్ద

# జపనీస్ క్లస్టర్‌గా.. శ్రీసిటీ

**- ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి వెల్లడి**




భారత్-జపాన్ ప్రభుత్వాలు సంయుక్తంగా మనదేశంలో అభివృద్ధి చేస్తున్న 13 జపనీస్ ఇండస్ట్రియల్ టౌన్‌షిప్‌లలో శ్రీసిటీ ప్రధానమైనదని, వివిధ ఉత్పాదక రంగాల్లోని 25కి పైగా జపనీస్ పరిశ్రమలతో శ్రీసిటీ దేశంలో రెండవ అతిపెద్ద జపనీస్ క్లస్టర్‌గా అవతరించిందని శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తెలిపారు. ఈనెల 2న జపనీస్ పరిశ్రమల వారితో కలసి నిర్వహించిన డిజిటల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మరిన్ని జపనీస్ కంపెనీలను ఆకర్షించేందుకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించాలని సూచించారు. రాష్ట్రంలో సులభతర వ్యాపారాభివృద్ధి లక్ష్యంగా కేంద్ర పరిశ్రమలు, వాణిజ్య ప్రోత్సాహక విభాగం, ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు(ఇడిబి), శ్రీసిటీ సంయుక్తంగా శ్రీసిటీ జపనీస్ పరిశ్రమలతో కలసి ఈ డిజిటల్ సమావేశంలో పాల్గొని తమ అభిప్రాయాలను పంచుకున్నాయి. డిపిఐఐటి అదనపు కార్యదర్శి సుమితా దావ్రా ప్రతినిధులకు స్వాగతం పలకగా, రాష్ట్ర పరిశ్రమల డైరెక్టర్, ఇడిబి సిఇఓ జెవిఎన్ సుబ్రహ్మణ్యం, ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్టక్చర్ కార్పొరేషన్ వైస్‌ఛైర్మెన్, మేనేజింగ్ డైరెక్టర్ కె.రవీన్‌కుమార్‌రెడ్డి, శ్రీసిటీ జపనీస్ కంపెనీల గ్రూప్ ఛైర్మెన్ మసాహిరో యమగుచి పాల్గొన్నారు.

# ఎన్‌బికెఆర్‌లో వెబ్‌నార్



విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో ఈనెల 3న సిఎస్‌ఇ బ్రాంచ్ ఆధ్వర్యంలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్-దాని ప్రయోజనాలు అనే అంశంపై వెబ్‌నార్ నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ డా. వి. విజయకుమార్‌రెడ్డి, సిఎస్ఇ విభాగం అధిపతి డా.యస్. మాధ్యూపెరుమాల్, ఎస్ అండ్ హెచ్ విభాగం అధిపతి డా.సిహెచ్ రవీంద్రరెడ్డి, సిఎస్ఇ ప్రొఫెసర్ ఎం.నటరాజ సురేష్ పాల్గొని విద్యార్థులకు ఈ అంశంపై అవగాహన కలిగించారు. అలెక్టియోలో ముఖ్య శాస్త్రవేత్తగా పనిచేస్తున్న ఎస్.అరుణ్‌రాయ్‌ని కళాశాల డైరెక్టర్ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆహ్వానించారు. ఇలాంటి వెబ్‌నార్ కార్యక్రమాల వల్ల ఏఏ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయో తెలుస్తాయని వారు విద్యార్థులకు తెలియజేశారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ అంటే అల్గారిథమ్స్ ద్వారా మిషన్స్‌ను ఆలోచించేవిధంగా తయారుచేయడమేనని, బ్యాంకింగ్ తదితర రంగాల్లో వీటిని బాగా ఉపయోగిస్తున్నారని వారు విద్యార్థులకు వివరించి, సందేహాలను నివృత్తి చేశారు.

## 48వ డివిజన్‌లో...

# పరిశుభ్రతా చర్యలు చేపట్టండి

నెల్లూరు నగరంలోని 48వ డివిజన్ ఉయ్యాల కాలువ వద్ద చెత్తకుప్పలు, మురుగు పేరుకుపోవడంతో ప్రజలు నానా అవస్తలు పడుతున్నారని, అధికారులు పరిశీలించి అక్కడున్న చెత్తకుప్పలను, మురుగును తొలగించి పరిశుభ్రం చేయించాలని బిజెవైఎం జిల్లా శాఖ అధ్యక్షుడు యశ్వంత్‌సింగ్ కోరారు. ఈనెల 3న ఆయన ఆ ప్రాంతంలో పర్యటించి పరిస్థితినంతా చూసి ఇక్కడ దోమలబెడద ఎక్కువగా ఉందని, ప్రజలు లేనిపోని రోగాలకు గురికాకుండా కార్పొరేషన్ అధికారులు వెంటనే పరిశుభ్రతా చర్యలు చేపట్టాలని కోరారు.

వీక్షణం

- మంజీర

# ఎన్నికల 'పంచాయతీ'




ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీ ఎన్నికల నగారా మోగింది. ప్రభుత్వం ఏకగ్రీవాలకు స్వాగతం పలుకుతోంది, ప్రోత్సాహకాలను కూడా ప్రకటించింది. నామినేషన్‌లు వేయించడమే విజయానికి తొలిమెట్టు అనుకుంటోంది ప్రతిపక్షం. నామినేషన్ వేయించగలిగితే అధికార పార్టీ మీద నైతికంగా విజయం సాధించినట్లే అన్నంత పట్టుదలతో కూడా ఉన్నట్లుంది. ఇంతకీ ఇవి ఏ ఎన్నికలు? గ్రామ పంచాయితీ ఎన్నికలు. బ్యాలెట్ పేపర్‌లో అభ్యర్థులకు గుర్తింపు పొందిన రాజకీయపార్టీల చిహ్నాలేవీ కనిపించవు. ఎన్నికల సంఘం నిర్ణయించిన జాబితా నుంచి గుర్తు కేటాయిస్తారు. రాజకీయ పార్టీలు-వాటి వ్యూహాల ప్రభావం గ్రామాల మీద పడకూడదనే సదుద్దేశంతో రాజ్యాంగంలో పొందుపరుచుకున్న నిబంధన ఇది. గ్రామ సర్పంచ్‌ని ఎన్నుకునే ప్రక్రియలో రాజకీయ పార్టీల జోక్యం ఉండకూడదని, గ్రామస్థులు తమ గ్రామాభివృద్ధికి పనిచేసే వ్యక్తిని సర్పంచ్‌గా ఎన్నుకోవడానికి అనువైన వాతావరణం కల్పించడమే పార్టీ గుర్తు లేకుండా ఎన్నికలు జరపడంలోని ఆంతర్యం. అయితే జరుగుతున్నదేమిటి? పార్టీ గుర్తులు ఉండవు, కానీ పార్టీలు ఉన్నాయి. గ్రామాల్లో రాజకీయ జోక్యం తగ్గించడానికే ఏకగ్రీవాలు... అని సీఎం చెప్పారు. కానీ సీఎం దృష్టిలో పడడం కోసం ఏకగ్రీవాలు చేయించడానికి నాయకులు విపరీతంగా జోక్యం చేసుకుంటున్నారు.

### కండువాల 'పంచాయతీ'

రాజకీయ పార్టీల జోక్యం లేని పంచాయతీ ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలో ప్రధాన రాజకీయ పార్టీలు రెండూ పోటాపోటీగా కండువాలు కప్పుతున్నాయి. గడచిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా నాయకులు తమ తమ పార్టీ కండువాలను టోకున ముద్రించి పెట్టుకున్నట్లున్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు కొందరు ఎన్నికల తర్వాత మిగిలిపోయిన వాటిని కప్పడానికి మనుషుల కోసం వేట మొదలుపెట్టారు. ఆ పార్టీ ఈ పార్టీ అనే తేడా ఏమీ లేదు, ఎమ్మెల్యేల దగ్గరకు ఏదో ఒక సహాయం కోసం వచ్చిన వారందరికీ కప్పేశారు. ఇప్పుడు ఆ వంతు ప్రధాన ప్రతిపక్షం తీసుకుంటోంది. ఏడాదిన్నర కాలంలో మూడు రంగుల కండువాలు కప్పుకున్న వాళ్లు ఆ కండువాను చిలక్కొయ్యకు తగిలించడానికి సిద్ధమయ్యారు. వారిలో సింహభాగం తిరిగి పాత కండువా కోసం తలలు వంచుతున్నారు. ప్రజాస్వామ్యంలో అధికారపక్షంతో పాటు ప్రతిపక్షం కూడా ఉండి తీరాలి. ఈ చిన్న సూత్రాన్ని గాలికొదిలేసిన కొందరు నాయకులు 'మా నియోజకవర్గంలో ప్రతిపక్షాన్ని ఖాళీ చేస్తున్నాం' అని అధినాయకుడి దృష్టిలో పడడానికి చేసిన ప్రయత్నాలు పంచాయతీ ఎన్నికల సందర్భంగా బెడిసికొడుతున్నాయి. మూకుమ్మడిగా కండువాలు కప్పిన నియోజకవర్గాల్లో ఈ పరిణామం స్పష్టంగా కనిపిస్తోంది.

### ఏకగ్రీవ 'పంచాయతీ'

ఏకగ్రీవాల కోసం నాయకులు రాత్రింబవళ్లు పావులు కదుపుతున్నారు. కరోనా భయం ఇంకా వదలకపోవడంతో ఈ ఎన్నికల్లో ఆత్మీయ ఆలింగనాలు లేవు, విందు సమావేశాలు కూడా సన్నగిల్లాయి. అయితే అర్ధరాత్రి రహస్య మంతనాలు మాత్రం ఊపందుకున్నాయి. డిజిటల్ యుగంలో వాట్సాప్ కాల్స్‌తో రాజకీయ సమీకరణలు మారిపోతున్నాయి. పార్టీ గుర్తులు ఉండవు, కానీ ఎవరు ఏ పార్టీ మద్దతుదారులనేది తెరిచిన పుస్తకమే. అధికార పార్టీ ఒక గ్రామంలో సర్పంచ్ పదవిని ప్రతిపక్ష పార్టీ మద్దతుదారుకు వదులుకుని తాను ఉప సర్పంచ్ పదవితో సరిపెట్టుకోవడానికి సిద్ధమైంది. ఇదిలా ఉంటే ఏకగ్రీవాల ఆలోచన ఏదో తమకు కలిసొచ్చేలా ఉందని కొందరు రాత్రికి రాత్రి అభ్యర్థుల అవతారం ఎత్తేశారు. సర్పంచ్‌గా పోటీ చేయాలనే ఆలోచన లేని వాళ్లు కూడా నామినేషన్‌లు వేసేసి ఇంట్లో కాళ్లూపుకుంటూ కూర్చున్నారు. ఏకగ్రీవాల కోసం కసరత్తు చేస్తున్న నాయకులు తమ చేత నామినేషన్ ఉపసంహరింప చేయడానికి, తమను ఒప్పించడానికి ఏదో ఒక రూపంలో మెప్పించకపోతారా అనేది వాళ్ల ప్రణాళిక. మరికొందరు తమ పార్టీ పెద్దల ఆశీస్సులతో నామినేషన్‌లు వేశారు, ఉపసంహరణలోపు తెర వెనుక మంతనాలు, ఒప్పందాలు కుదిరిపోయాయి. 'మాట'లు చేతులు మారాయి. నిశ్శబ్దంగా తమ అభ్యర్థిత్వాన్ని ఉపసంహరించుకుని పార్టీ పెద్దలకు ఝలక్ ఇచ్చారు. ఎలాగైతేనేం... ఆ పంచాయితీ ఏకగ్రీవం అయిపోయింది. 'ప్రతిపక్షాన్ని ఖాళీ చేస్తున్నాం' అని అత్యుత్సాహం చూపించిన నాయకులు ఇప్పుడు 'ఎలాగైనా సరే' ఏకగ్రీవాలు చేయించి నాయకుడి మెప్పు పొందడానికి ఉవ్విళ్లూరుతున్నారు.

### రె'బెల్స్' మోత

పంచాయతీ ఎన్నికలకు రాజకీయపార్టీ గుర్తు లేదు, కానీ అధికార పార్టీ గుండెల్లో రె'బెల్స్' మోగుతున్నాయి. విరచిత అధికార పార్టీ ముద్ర ఉన్న వాళ్లలో ఒకరికంటే ఎక్కువ మంది సర్పంచ్ పదవి కోసం పోటీ పడుతున్నారు. అందరిదీ ఒకటే ఆశ... 'సామాన్య జనంలో సీఎం పట్ల అసెంబ్లీ ఎన్నికల నాటి అభిమానం కొనసాగుతోంది. అక్కడక్కడా మొదలైన అసంతృప్తి మొలకలు కూడా ఎమ్మెల్యేల మీదనే తప్ప అధినాయకుడి మీద కాదు. ఇప్పుడు ఎన్నికల్లో నిలబడితే విజయం తథ్యం. ఇన్నేళ్లపాటు పార్టీ కోసం చొక్కాలు చించుకున్నాను. ఇప్పుడు సర్పంచ్ అభ్యర్థిగా నాకు అవకాశం ఇవ్వడమే సరైన నిర్ణయం' అని ఊరికి ఇద్దరు - ముగ్గురు సిద్ధమయ్యారు. ఆ ఇద్దరు - ముగ్గురిని కూర్చోబెట్టి నియోజకవర్గ నాయకుడు ఒక అంగీకారానికి తీసుకురాగలగాలి. అంతటి నిష్ణాతులైన నాయకులు లేకపోవడం అధికార పార్టీకి పెద్ద లోటు. సమన్వయం చేయగలిగిన పరిణతి లేకపోవడంతోపాటు నియోజకవర్గ నాయకుల్లో షార్ట్ టెంపర్‌మెంట్ కూడా ఎక్కువైపోయినట్లుంది. ఎవరో ఒకరికి మద్దతు ప్రకటించేసి చేతులు దులుపుకున్నారు. 'మిగిలిన వారి' చేత సున్నితంగా నామినేషన్ ఉపసంహరింపచేయడంలో ఘోరంగా విఫలమయ్యారు. దీంతో 'మిగిలిన వాళ్ల' అహం దెబ్బతింటోంది. 'ఏది ఏమైనా సరే... నేను గెలవకపోయినా ఫర్వాలేదు, నియోజకవర్గ నాయకుడు మద్దతిచ్చిన అభ్యర్థి మాత్రం గెలవకూడదు' అనే కసి పెరిగిపోతోంది. ఈ పరిణామం వల్ల ఎదురయ్యే నష్టం అధికార పార్టీకి ఈ పంచాయతీ ఎన్నికలలో కనిపించకపోవచ్చు. కానీ ఇంతటి ఘోరమైన చీలికలు... రాబోయే మండల, జిల్లా పరిషత్ ఎన్నికల మీద తీవ్రమైన ప్రభావం చూపించే ప్రమాదం ఉంటుంది.

## ఏఆర్‌హెచ్‌సి పథకం లక్ష్యాలపై...

# రాజ్యసభలో వేమిరెడ్డి ప్రశ్నల వర్షం



వలస కూలీల కోసం అఫోర్డబుల్ అర్బన్ హౌసింగ్ కాంప్లెక్స్ (ఏఆర్‌హెచ్‌సి) పథకం లక్ష్యాలు, ఆశయాలు ఏమిటి?.. ఈ పథకం ప్రారంభించబడిందా?.. అలా అయితే అది పైలట్ ప్రాతిపదికన ఉందా లేదా?.. దానిపై రెగ్యులర్ ఆధారంగా ఈ ప్రాజెక్టు కోసం గుర్తించిన వివరాలు ఏమిటి?.. దేశంలోని వివిధ నగరాల్లో నగరాల వారీగా, మరియు రాష్ట్రాల వారీగా ప్రభుత్వ నిధులతో ఉన్న గృహాల వివరాలు, ప్రైవేట్ రంగం పాత్ర వివరాలు తెలియజేయాలంటూ ఈనెల 3న రాజ్య సభలో రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నల వర్షం కురిపించారు. అందుకు స్పందించిన కేంద్ర హౌసింగ్, అర్బన్ వ్యవహారాల మంత్రి హర్దీప్‌సింగ్ పూరి సమాధానమిస్తూ ఈ పథకాన్ని 2020 జులై 31న ప్రారంభించడం జరిగిందని, అవసరమైన పౌరసత్వంతో గౌరవప్రదమైన జీవితాన్ని పేదలకు అందించడం, పట్టణ వలసదారులకు, పేదలకు వారు పనిచేస్తున్న ప్రదేశాలకు సమీపంలో వారి ఆర్థికస్తోమతు మేరకు అద్దెతో కూడిన నివాస సౌకర్యాలను కల్పించడం ఈ పథకం ఉద్దేశ్యమని తెలిపారు. దీనిలో భాగంగా ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలను ప్రోత్సహిస్తూ వారి పరిధిలో ఉన్న ఖాళీస్థలాలను నివాసాలకు అనువుగా మారుస్తూ తద్వారా అనుకూలమైన వాతావరణం కల్పించడం జరుగుతుందని చెప్పారు. పట్టణ వలసదారులు, ఆర్థికంగా బలహీనంగా ఉన్నవారు, తక్కువ ఆదాయ వర్గాల వారు ఈ పథకానికి అర్హులని, పట్టణాల పరిధిలో ఖాళీగా ఉన్న ఇళ్ళను గుర్తించి వాటిని నివాస సముదాయాలుగా మార్చాలని రాష్ట్రాలను, మరియు కేంద్రపాలిత ప్రాంతాలను కోరడం జరిగిందని పేర్కొన్నారు.

### దేశంలో పెట్రోలియం నిల్వల పరిస్థితి ఏమిటి?

దేశంలోని వ్యూహాత్మక పెట్రోలియం నిల్వల కార్యక్రమం దశ-1లో యుఏఇ, మరియు సౌదీ అరేబియా పట్ల ఆసక్తి చూపడం వాస్తవం కాదా? దేశంలో భూగర్భ మరియు ఓవర్ గ్రౌండ్ గుహల వివరాలు, సామర్థ్యం, పెట్రోలియం నిల్వలను నిల్వ చేయడానికి స్థలాలను గుర్తించడం జరిగిందా?.. అలా జరిగితే దీనికి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన విశాఖపట్నం ఎంపిక చేయబడిదా లేదా, చేయకపోతే దానికి కారణాలేమిటని కూడా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నించారు. అందుకు స్పందించిన పెట్రోలియం మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ బదులిస్తూ అబుదాబి నేషనల్ ఆయిల్ కంపెనీ, యుఏఇ మరియు సౌదీ అరాంకో, భారతదేశం యొక్క వ్యూహాత్మక పెట్రోలియంలో పాల్గొనడానికి సౌదీ అరేబియా దశ-2 కార్యక్రమంతో ఆసక్తి చూపిందని పేర్కొన్నారు. ఐఎస్ఆర్‌ఎల్ మొత్తం 5.33 మిలియన్ల మెట్రిక్ టన్నుల (ఎంఎంటి) సామర్థ్యంతో మూడు ప్రదేశాల్లో ఎస్‌పిఆర్ సౌకర్యాలను తొలుత ఏర్పాటుచేసిందని పేర్కొన్నారు. విశాఖపట్నం (1.3ఎంఎంటి) మంగుళూరు (1.5ఎంఎంటి), పాదూర్ (2.5 ఎంఎంటి)లను తొలుత ఏర్పాటుచేసిందని, ఆ తర్వాత ప్రభుత్వం ఒడిస్సా రాష్ట్రంలోని చండిఖోల్, కర్నాటక రాష్ట్రంలోని పాదూర్‌లలో సూత్రప్రాయంగా అమోదించారని లిఖితపూర్వకంగా వేమిరెడ్డికి తెలియజేశారు.



## కోవిడ్ వ్యాక్సిన్ వేసుకున్న

# తొలి కలెక్టర్ చక్రధర్‌బాబు

### ఆదర్శంగా నిలిచిన నెల్లూరు జిల్లా కలెక్టర్, జేసీలు

రాష్ట్రంలో రెండవ విడత వ్యాక్సినేషన్‌లో భాగంగా ఫ్రంట్‌లైన్ వారియర్స్‌గా నిలిచిన ప్రభుత్వ అధికారులకు వ్యాక్సిన్ వేసే కార్యక్రమం ఈనెల 3న ప్రారంభం కావడంతో జిల్లాలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు తొలి వ్యాక్సిన్ వేసుకొని రాష్ట్రంలోని అధికారులందరికీ ఆదర్శంగా నిలిచారు. ఆయనతోపాటు జిల్లా జాయింట్ కలెక్టర్ హరేందిర ప్రసాద్ కూడా వ్యాక్సిన్ వేసుకున్నారు. ముందుగా తాము వ్యాక్సిన్ వేసుకుని అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలవడంతో వారు అందరి ప్రశంసలు అందుకున్నారు. ఈనెల 3న నెల్లూరులోని కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న డిఆర్‌డిఏ కార్యాలయంలో వారు కోవిడ్-19 వ్యాక్సిన్ వేసుకున్నారు.

### టీకా వేసుకోండి... కరోనాని నిర్మూలించండి

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కోవిడ్ మహమ్మారిని శాశ్వతంగా నిర్మూలించాలంటే ప్రతిఒక్కరూ ముందుకువచ్చి టీకా వేసుకోవడం ఎంతో ముఖ్యమని అన్నారు. టీకా వేసుకోవడం తనకెంతో ఆనందంగా ఉందన్నారు. కోవిడ్ వ్యాక్సిన్ వేసుకునేందుకు ఎవరూ సంకోచించాల్సిన అవసరం లేదని, ప్రతి ఒక్కరూ ధైర్యంగా ముందుకు వచ్చి వ్యాక్సినేషన్ చేయించుకోవాలని ఆయన అధికారులకు పిలుపునిచ్చారు.

### అధికారులను అభినందించిన కలెక్టర్

కోవిడ్ నేపథ్యంలో ప్రజలకు సేవలందించడంలో కీలకపాత్ర పోషించిన జిల్లా జాయింట్ కలెక్టర్‌లు ఎన్.ప్రభాకర్‌రెడ్డి, డా. హరేందిరప్రసాద్, నోడల్ అధికారి జడ్పీ సిఇఓ సుశీల, డిఎఫ్ఓ షణ్ముఖకుమార్, డిపిఓ ధనలక్ష్మితోపాటు ఉత్తమ సేవలందించిన అనేకమంది అధికారులను, వైద్య ఆరోగ్య సిబ్బందిని కలెక్టర్ ఈ సందర్భంగా అభినందించారు. ఫ్రంట్‌లైన్ సేవల్లో అన్ని శాఖల కంటే పోలీసు సిబ్బంది సేవలు మరింత ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ నాగేశ్వరరావు, డిఎంఅండ్‌హెచ్ఓ రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# మిమ్మల్ని ఎప్పటికీ మరువలేం

### బాలు-వెన్నెలకంటిలకు 'ఆస్కా' నివాళి



గానగంధర్వుడు ఎస్పీ బాలు, సినీకవి వెన్నెలకంటిల స్మృతికి చెన్నైలోని ఆంధ్రా సోషల్, కల్చరల్ అసోసియేషన్ (ఆస్కా) ఈనెల 3వతేదిన ఘన నివాళులర్పించింది. బాలును, వెన్నెలకంటిని ఎప్పటికీ మరువలేమంటూ 'ఆస్కా గాన-సాహితీ దిగ్గజాలకు శ్రద్ధాంజలి' పేరుతో సంతాప సభ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న దక్షిణభారత నిర్మాతల మండలి అధ్యక్షుడు కాట్రగడ్డ ప్రసాద్ మాట్లాడుతూ తన అద్వితీయమైన గానంతో బాలు ప్రజల గుండెల్లో శాశ్వతస్థానం సంపాదించుకున్నారు. డాక్టర్ సిఎంకెరెడ్డి మాట్లాడుతూ బాలు కోహినూర్ వజ్రం లాంటివాడని, అందరికీ ఆదర్శనీయుడని కొనియాడారు. బాలు తన గానమాధుర్యంతో అంతర్జాతీయఖ్యాతిని సంపాదించుకున్నారని సినీ రచయిత భువనచంద్ర అన్నారు. ఆస్కా అధ్యక్షుడు కె.సుబ్బారెడ్డి మాట్లాడుతూ బాలు బహుముఖప్రజ్ఞాశాలి అని కొనియాడారు. బాలు, వెన్నెలకంటిలను కోల్పోవడం బాధాకరమని సంగీత దర్శకుడు సాలూరి వాసూరావు ఆవేదన చెందారు. కొద్ది నెలల వ్యవధిలోనే ఇద్దరు గొప్ప వ్యక్తులను కోల్పోవడం బాధాకరమని ఆస్కా సంయుక్త కార్యదర్శి జెకె రెడ్డి అన్నారు. బాలు సోదరి ఎస్పీ వసంత తన అన్న మరణించిన దు:ఖంలో ఆయన కోసం రచించి స్వరపరిచిన 'ఎందుకే ఎందుకే కన్నీటిచుక్క' అనే గీతాన్ని ఆలపించి కన్నీటి నివాళులర్పించారు. బాలు సోదరుని కుమారుడు అభిషేక్, వెన్నెలకంటి కుమారుడు రాకేందుమౌళి పాల్గొని పలు గీతాలను ఆలపించారు.









Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Managing Editor : T.BHARATHI REDDY, Sub-Editor : MADDURU SRINIVASULU. e-mail: lawyerpatrika@gmail.com